

నాటక రచయిత బాదంగీర్ సాయి కన్నుమూత

ప్రముఖ నాటక రచయిత, రంగసాయి నాటక సంఘం, రంగసాయి నాటక గ్రంథాలయం వ్యవస్థాపకులు ఏవీవీ ఎస్ మూర్తి (బాదంగీర్ సాయి) గురువారం సాయంత్రం కన్నుమూశారు. శుక్రవారం ఉదయం మాధవధారలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. - మెయిన్‌లో



బాదంగీర్ సాయి (ఫైల్)

అండర్ స్టాండింగ్!

జీవీఎంసీ స్థాయీ సంఘంలోని కొంతమంది సభ్యులపై ఆరోపణలు



- నేడు స్టాండింగ్ కమిటీ సమావేశం
- 117 అంశాలతో ఎజెండా
- అనేక వివాదాస్పద అంశాలు

- ఎజెండా చేతికి అందగానే కాంట్రాక్టర్లకు ఫోన్లు
- పది శాతం కమీషన్ ఇస్తేనే ఆమోదిస్తామంటూ బేరాలు
- అందరికీ వాటాలు ఇవ్వాల్సి ఉందని చెబుతున్న వైనం
- వాయిస్ రికార్డు చేసిన ఒక కాంట్రాక్టర్



విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ స్థాయీ సంఘం కొందరు సభ్యుల తీరుతో అండర్ స్టాండింగ్ కమిటీగా మారిపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎజెండాలో చేర్చిన అంశాలను ఆమోదించాలంటే పది శాతం కమీషన్ ఇవ్వాలంటూ కొందరు పట్టుబడుతున్నట్టు సమాచారం. కమిటీలోని ఇతర సభ్యులతోపాటు మేయర్, కార్యదర్శి పేషీకి కూడా వాటాలు ఇవ్వాల్సి ఉంటుందని, కమీషన్ ఇచ్చేందుకు అంగీకరించని పక్షంలో ఆయా అంశాలను తిరస్కరించడమో, వాయిదా వేయడమో చేస్తామని బెదిరిస్తున్నట్టు కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు.

జీవీఎంసీ ఎన్నికలు జరిగిన తర్వాత ఏర్పడిన తొలి రెండు స్టాండింగ్ కమిటీల్లో ఎజెండాలో చేర్చిన అంశాల్లో బిల్లులు చెల్లింపు, కాంట్రాక్టులు అప్పగింత వంటి అంశాలకు రెండు శాతం కమీషన్ వసూలు చేసేవారనే ఆరోపణలు ఉండేవి. మూడో ఏడాది ఏర్పడిన స్టాండింగ్ కమిటీ మాత్రం కమీషన్‌ను ఐదు శాతానికి పెంచినట్టు చెప్పుకునేవారు. తాజాగా ఏర్పడిన స్టాండింగ్ కమిటీ హయాంలో మాత్రం కమీషన్ మొత్తాన్ని ఏకంగా పది శాతానికి పెరిగిపోయిందంటున్నారు. స్టాండింగ్ కమిటీలో సభ్యులందరి పాత్ర కమీషన్ వసూలు అంశంలో బయటపడకపోయినా, నలుగురు మాత్రం కీలకంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నేరుగా కాంట్రాక్టర్లకు ఫోన్ చేసి 'మీ అంశం ఒకటి ఎజెండాలో పెట్టారు. మీరు మాత్రం ఇంకా మమ్మల్ని కలవలేదు. వచ్చి కలిస్తే ఆమోదించేస్తాం' అని చెబుతున్నారు. కాంట్రాక్టర్లు వెళ్లి కలిస్తే స్టాండింగ్ కమిటీతోపాటు మేయర్, కార్యదర్శి పేషీలో ఖర్చులకు పది శాతం ఇవ్వాల్సిందేనని కరాఖండిగా చెబుతున్నారు. తాము కలవని పక్షంలో ఎజెండాలోని ఆయా అంశాలను ఆమోదించడం లేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఈనెల ఎనిమిదిన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో మూడు అంశాలపై సభ్యులు భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేయడంతో మేయర్ గొలగాని హరివెంకటకుమారి అయోమయానికి గురయ్యారు. ఆయా అంశాలకు సంబంధించిన టెండర్లు పిలిచినప్పుడు అధికారులు ఏఏ పత్రికల్లో టెండర్ నోటిఫికేషన్ ఇచ్చారనే దానితోపాటు జనవరిలో వేలం పూర్తయితే ఇంతవరకూ కాంట్రాక్టర్‌కు ఎందుకు అప్పగించలేదని కొంతమంది సభ్యులు ప్రశ్నించారు. దీనికి అధికారులు వివరణ ఇవ్వడానికి నీళ్ల నమలడంతో సభ్యులంతా ఆయా అంశాలను తిరస్కరించాలని డిమాండ్ చేశారు. దీంతో మేయర్ ఆయా అంశాలను వాయిదా వేద్దామని ప్రతిపాదించగా, ఒక సభ్యుడు మాత్రం జీవీఎంసీకి ఆదాయం వస్తుంది కాబట్టి, ఆమోదించాలంటూ మేయర్‌ను కోరారు. ఆ సభ్యుడు పక్కనే ఉన్న సభ్యులకు చెవిలో ఏదో చెప్పగానే, మెజారిటీ సభ్యులు వెంటనే అధికారులు వివరణ ఇవ్వకపోయినా ఆ అంశాలను ఆమోదించేయాలని మేయర్‌ను కోరడంతో ఆమె అవాక్కయ్యారు. ఇప్పటికిప్పుడే మీరు భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నారని, ఏం చేద్దామో...స్పష్టంగా చెప్పాలనడంతో సమావేశంలో ఉన్న అధికారులంతా ఒక్కసారిగా నవ్వారు. దీంతో సభ్యులు ఆయా అంశాలపై వివరణ ఇచ్చేవరకూ వాయిదా వేయాలని కోరారు. అయితే ఆ అంశంపై ఒక సభ్యుడు సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడుకుని ఆమోదిస్తామని హామీ ఇచ్చారని, విషయం మిగిలిన సభ్యులకు చెప్పకపోవడంతో వారంతా తిరస్కరించాలని కోరారని, తీరా మేయర్ కూడా వాయిదా వేద్దామా?, తిరస్కరిద్దామా?...అనే అడిగేసరికి సదరు సభ్యుడు అప్రమత్తమై మిగిలిన సభ్యులకు కమీషన్ ఇవ్వడానికి కాంట్రాక్టర్ అంగీకరించాడని చెప్పడంతో మళ్లీ అభిప్రాయం మార్చుకున్నారని అక్కడున్న వారంతా చర్చించుకోవడం కనిపించింది.

తాజాగా శుక్రవారం మరోసారి స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించడానికి కార్యదర్శి బీవీ రమణ ఏర్పాట్లు పూర్తిచేశారు. 117 అంశాలతో ఎజెండా తయారుచేసి గురువారం సభ్యులకు అందజేశారు. ఎజెండా అందగానే కమిటీలో కొందరు సభ్యులు కొంతమంది కాంట్రాక్టర్లకు ఫోన్ చేసి కమీషన్ల కోసం బేరాలడడం చర్చనీయాంశంగా మారింది. కాంట్రాక్టర్ ఒకరు వాయిస్ రికార్డు చేసి తనకు అత్యంత సన్నిహితుడికి పంపించడంతో జీవీఎంసీలో పెద్దఎత్తున చర్చ జరిగిందని కొందరు అధికారులు చెబుతున్నారు.

పారిశుధ్య సిబ్బంది పేరుతో బిల్లులు

జీవీఎంసీ పరిధిలో దాదాపు 6,500 మంది అవుట్‌సోర్సింగ్ కార్మికులు, 1,100 మంది శాశ్వత కార్మికులు

... మిగతా 6వ పేజీలో

3 నెలల్లో టీసీఎస్

అసెంబ్లీలో మంత్రి నారా లోకేశ్ వెల్లడి



- ఐటీ రంగంపై చర్చ సందర్భంగా ప్రకటన
- పరిశ్రమ సమస్యలపై గళమెత్తిన జిల్లా ఎమ్మెల్యేలు
- ఐటీ పార్కులో మౌలిక వసతులు కల్పించండి: గంటా
- పెద్ద కంపెనీలను తీసుకురండి: వంశీకృష్ణ
- స్టార్టప్ విలేజ్‌లో కంపెనీలను వైసీపీ ప్రభుత్వం గెంటేసిందన్న విష్ణుకుమార్‌రాజు
- అసెంబ్లీ సమావేశాలు ముగిశాక రాయితీలు విడుదల చేస్తామన్న మంత్రి

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):

టాటా కన్సల్టెన్సీ సర్వీస్ సంస్థ (టీసీఎస్) మూడు నెలల్లో విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ అసెంబ్లీలో వెల్లడించారు. విశాఖపట్నంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా ఎమ్మెల్యేలు గురువారం అసెంబ్లీలో గళమెత్తారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో మిలీనియం టవర్లు, స్టార్టప్ విలేజీ భవనాలు ఖాళీగా ఉంచారని, హెచ్ఎస్‌బీసీ, ఐబీఎం వంటివి వ్యాపారాలు మానుకున్నాయని అన్నారు. ఐటీ కంపెనీలు ఉన్న రుషికొండ ప్రాంతం సాయంత్రం ఆరు దాటితే నిర్మానుష్యంగా మారిపోతున్నదన్నారు. రహదారులు, 24/7 విద్యుత్, మంచినీటి సదుపాయం, తదితర మౌలిక వసతులు కల్పించాలన్నారు. టీసీఎస్‌ను నిర్దిష్ట గడువులోగా తీసుకురావాలని, ఐటీ కంపెనీలకు పెండింగ్‌లో ఉన్న రాయితీలను విడుదల చేయాలని కోరారు.

విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, విశాఖలో నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేలు జీతాలు ఇచ్చే ఐటీ కంపెనీలు ఉన్నాయని, హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో రూ.50 వేలు ఇస్తున్నారన్నారు. అలాంటి పెద్ద కంపెనీలను విశాఖపట్నానికి తీసుకురావాలని కోరారు. విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎస్‌టీపీఐ కేంద్రం ఏర్పాటుకు రూ.40 కోట్లు ఇస్తామని ముందుకువస్తే గత ప్రభుత్వం ఎకరా భూమి ఇవ్వలేకపోయిందన్నారు. మెరుగైన ఇంటర్నెట్ కనెక్టివిటీ కోసం నిక్సీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరినా పట్టించుకోలేదని ఆరోపించారు. స్టార్టప్ విలేజ్‌లో 150 కంపెనీలు ఉంటే వైసీపీ ప్రభుత్వం వారిని బయటకు గెంటేసిందన్నారు. రెంటల్ పాలసీకి స్పందించి అనేక కొత్త కంపెనీలు వస్తే వారికి ఇవ్వాల్సిన రాయితీలు ఇవ్వలేదన్నారు. హైదరాబాద్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హైటెక్ సిటీగా అభివృద్ధి చేసినట్టు, విశాఖను లోకేశ్ ఐటీ రంగంలో అభివృద్ధి చేయాలని కోరారు. ఎమ్మెల్యేల ప్రశ్నలకు మంత్రి లోకేశ్ సమాధానమిస్తూ విశాఖపట్నాన్ని డేటా సెంటర్ల హబ్‌గా అభివృద్ధి చేస్తామని ఇప్పటికే ప్రకటించామని, ఆ దిశగా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఐటీ కంపెనీలకు రాయితీల కోసం రూ.500 కోట్లు బడ్జెట్‌లో కేటాయించామని, అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తరువాత బకాయిలు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ద్వితీయ, తృతీయశ్రేణి నగరాల్లో కూడా ఐటీకి కో వర్కింగ్ స్పేస్ అందుబాటులోకి తేవడానికి యత్నాలు జరుగుతున్నాయన్నారు.

ప్రసాదరెడ్డి అక్రమాలపై విచారణ చేపట్టాలి

- ఆయన హయాంలో అవినీతి, అక్రమాలకు నిలయంగా ఏయూ
- అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ ప్రసాదరెడ్డి గడిచిన ఐదేళ్లలో సాగించిన అడ్డగోలు వ్యవహారాలపై విచారణ చేపట్టాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ 2019 నుంచి 2024 మధ్యకాలంలో ఆంధ్ర యూనివర్సిటీ అవినీతి, అక్రమాలకు కేంద్ర బిందువు మారిందని, దీనికి ప్రసాదరెడ్డే కారణమని పేర్కొన్నారు. వర్సిటీ నిబంధనలను ఉల్లంఘిస్తూ సెనేట్ హాల్‌లో రాజకీయ నాయకుల పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారని, జీవీఎంసీ ఎన్నికల్లో అధికార వైసీపీ తరపున అభ్యర్థులను వర్సిటీలో కూర్చుని ఆయనే ఎంపిక చేశారని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో కాలేజీల యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించారని, వీటన్నింటిపై విచారణ నిర్వహించాలని స్పీకర్‌ను పల్లా కోరారు. అలాగే పాస్టర్‌గా ఉన్న లెక్చరర్‌ను వర్సిటీకి తీసుకువచ్చి రిజిస్ట్రార్‌గా బాధ్యతలను అప్పగించారన్నారు. యూజీసీ



... మిగతా 6వ పేజీలో

తప్పుడు పత్రాలు సమర్పిస్తే కేసులు

రిజిస్ట్రేషన్ వ్యవహారంలో మోసపూరితంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదు



- పెందుర్తి, భీమిలి, ద్వారకానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఇలాంటివి వెలుగులోకి వచ్చాయి
- అన్నీ పరిశీలించుకున్నాకే స్థిరాస్తులు కొనండి
- స్టాంపు పేపర్లకు ఎటువంటి కొరత లేదు
- జిల్లా రిజిస్ట్రార్ టి.ఉపేంద్రరావు

[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఎవరైనా సరే తప్పుడు పత్రాలు సమర్పించి స్థిరాస్తులను రిజిస్టర్ చేసుకున్నట్టయితే వారిపై క్రిమినల్ కేసులు తప్పవని జిల్లా రిజిస్ట్రార్ టి.ఉపేంద్రరావు హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యాన ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తప్పుడు రిజిస్ట్రేషన్లపై వారానికి కనీసం ఐదు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. గురువారం ఆయన పలు అంశాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడారు. ఇప్పటివరకూ సుమారు 150 ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై విచారణ ప్రారంభించామన్నారు.

ప్ర: తప్పుడు రిజిస్ట్రేషన్ ఎవరు చేయించుకుంటున్నారు?

జ: కొందరు తమవి కాని ఆస్తులకు సంబంధించి తప్పుడు పత్రాలు సృష్టించి వాటి ఆధారంగా రిజిస్టర్ చేసుకుంటున్నారు. మరికొన్ని సందర్భాల్లో ఒకరికి బదులుగా వేరొకరు వచ్చి డాక్యుమెంట్‌లో ఉన్న పేరు గల వ్యక్తిని తానేనంటూ రిజిస్టర్ చేసుకుంటున్నారు. ఇంకొందరు రెవెన్యూ శాఖ నుంచి తప్పుడు సర్వే నివేదికలు సమర్పించి పనులు పూర్తి చేసుకుంటున్నారు. అదేవిధంగా ఉమ్మడి కుటుంబాల ఆస్తుల విషయంలో తాము తప్ప ఇంకెవరూ వారసులు లేరని వాస్తవాలు దాచి రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. కక్షిదారులు సమర్పించిన ఆధారాలు పరిశీలించి సబ్ రిజిస్ట్రార్లు పనులు చేస్తారు. తప్పుడు వివరాలు సమర్పించిన వారే బాధ్యులు అవుతారు. వారిని ప్రాసిక్యూట్ చేస్తాం.

ప్ర: ఎక్కడ ఇలాంటివి ఎక్కువ జరిగాయి?

జ: ఇప్పటివరకూ అందిన ఫిర్యాదుల ప్రకారం చూసుకుంటే పెందుర్తి, భీమిలి, ద్వారకా నగర్ ప్రాంతాల్లో ఇలాంటి కేసులు వెలుగులోకి వచ్చాయి.

ప్ర: స్థిరాస్తి కొంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జ: జీవితంలో ఎవరైనా సరే ఒకటి లేదా రెండు మాత్రమే స్థిరాస్తులు సమకూర్చుకోగలుగుతారు. కష్టపడి సంపాదించిన సొమ్ము పరులపాలు కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కొనాలనుకుంటున్న ఆస్తికి సంబంధించిన ఎంకంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ) తీసుకోవాలి. దానివల్ల అది ఎవరి పేరున ఉందో తెలుస్తుంది. సర్వే నంబరు అదేనా?, వేరొకటి వేశారా?...అనేది చెక్ చేసుకోవాలి. క్షేత్రస్థాయికి వెళ్లి పరిసరాల్లో ఉంటున్న వారితో మాట్లాడి ఆ భూమి వారసులు, హక్కుదారులు

... మిగతా 6వ పేజీలో

అప్‌గ్రేడేషన్‌పై ఆశలు

- ప్రాంతీయ కంటి ఆస్పత్రిని రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆప్తమాలజీ (ఆర్ఐవో)గా మార్చేందుకు ఏడేళ్ల కిందట ప్రతిపాదనలు
- ముందుకుతీసుకువెళ్లిన నాటి తెలుగుదేశం ప్రభుత్వం
- ఆ తరువాత ప్రభుత్వం మారడంతో ఫలించని యత్నాలు
- ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో కదలిక
- అప్‌గ్రేడ్ చేస్తే అందుబాటులోకి అధునాతన విభాగాలు, పరికరాలు
- రోగులకు మరిన్ని సేవలందించేందుకు వీలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలోని ప్రాంతీయ కంటి ఆస్పత్రిని రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆప్తమాలజీ (ఆర్ఐవో)గా అప్‌గ్రేడ్ చేయాలన్న ప్రతిపాదనలు మళ్లీ జీవం పోసుకుంటున్నాయి. ఏడేళ్ల కిందట అప్పటి సూపరింటెండెంట్ డాక్టర్ నరసింహారావు ఈ ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసేందుకు యత్నించారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం సహకరించింది. కానీ ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రతిపాదనలు మూలకు చేరాయి. అప్‌గ్రేడేషన్ అయితే ఖరీదైన, క్లిష్టతరమైన శస్త్రచికిత్సలు చేసే అవకాశం లభిస్తుంది. అధునాతన వైద్య పరికరాలు, విభాగాలు అందుబాటులోకి వస్తాయి.

దేశంలోని అనేక రాష్ట్రాల్లో కంటి ఆస్పత్రులు ఆర్ఐవోగా అప్‌గ్రేడ్ అయ్యాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లోని సరోజినీదేవి కంటి ఆస్పత్రిని కేంద్ర ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. రాష్ట్ర విభజన తరువాత విశాఖ ప్రాంతీయ కంటి ఆస్పత్రికి ఆ హోదా కోసం అధికారులకు ప్రతిపాదించారు. నాటి టీడీపీ ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను ముందుకు తీసుకువెళ్లింది. ప్రజా ప్రతినిధులు తమ వంతు కృషిచేయడంతో గుర్తింపు లభిస్తుందని భావించారు. అయితే 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడం, అప్పటి ఉన్నతాధికారి రిటైర్ కావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. కొంతమంది అధికారులు యత్నించినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కార్యరూపం దాల్చలేదు.

అప్‌గ్రేడ్ చేస్తే...

అనేక రాష్ట్రాల్లోని కంటి ఆస్పత్రులను కేంద్ర ప్రభుత్వం ఆర్ఐవోగా అప్‌గ్రేడ్ చేస్తోంది. ఇందుకోసం విశాఖ ప్రాంతీయ కంటి ఆస్పత్రితోపాటు కర్నూలులోని

... మిగతా 6వ పేజీలో

ట్రాఫిక్ ఎస్ఐపై సస్పెన్షన్ వేటు

- రైటర్‌పై కూడా...
- డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తి నుంచి డబ్బులు తీసుకున్నట్టు అభియోగం
- విచారణలో నిజమేనని తేలడంతో సీపీ యాక్షన్



ఎస్‌వీ భాస్కరరావు

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):

అవినీతికి పాల్పడిన త్రీటౌన్ ట్రాఫిక్ ఎస్ఐతోపాటు స్టేషన్ రైటర్‌ను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి గురువారం సస్పెండ్ చేశారు. గత కొద్దిరోజులుగా త్రీటౌన్ ట్రాఫిక్ ఎస్ఐగా ఎస్‌వీ భాస్కరరావు అటాచ్‌మెంట్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల ఆయన తన సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఎస్ఐ భాస్కరరావు మరొకచోట డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్‌డ్రైవ్‌లో పాల్గొనేందుకు వెళుతూ...అక్కడ తనిఖీ చేసే బాధ్యతను ఏఎస్ఐకి అప్పగించారు. ఏఎస్ఐ తనిఖీలు చేస్తుండగా ఒకరు మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్టు పరీక్షలో తేలింది. దీంతో అతడి వాహనాన్ని సీజ్ చేసి త్రీటౌన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ రైటర్ సీహెచ్ జయరావుకు అందజేశారు. ఇదిలావుండగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తి ఒక మధ్యవర్తి ద్వారా త్రీటౌన్‌లో ట్రాఫిక్ ఎస్ఐతోపాటు రైటర్‌ను కలిసి డబ్బులిచ్చి బైక్ తాళాలను తీసుకున్నారు. డబ్బులు తీసుకున్న ఎస్ఐ, రైటర్ కలిసి కేసును కోర్టులో ప్రవేశపెట్టకుండా వదిలేశారని ఎవరో సీపీ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై విచారణకు ఆదేశించిన సీపీ...తనకు అందిన ఫిర్యాదులో వాస్తవం ఉందని తేలడంతో

... మిగతా 6వ పేజీలో

పెరిగిన వాయు కాలుష్యం

- గడచిన వారం రోజులుగా నగరవాసులు ఉక్కిరిబిక్కిరి
- గాలిలో పెరుగుతున్న ధూళి కణాలు
- కాలుష్యం తగ్గించేందుకు కార్యాచరణ : డిప్యూటీ సీఎం పవన్

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):



నగరవాసులను వారం రోజులుగా కాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. గాలిలో ధూళికణాలు పీఎం 10 (0.01 ఎంఎం), పీఎం 2.5 (0.0025 ఎంఎం) క్రమేపీ పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. గురువారం పీఎం 10 అయితే 172, పీఎం 2.5...182 రికార్డయ్యాయి. సాధారణంగా 24 గంటల వ్యవధిలో పీఎం10...100, ఏడాది సగటు 60గా, పీఎం 2.5 అయితే 24 గంటల వ్యవధిలో 60, ఏడాది సగటు 40 మైక్రో గ్రాములుగా ఉండాలి. అటువంటిది నగరంలో గత వారం రోజులుగా ఈ రెండూ మూడింతలు ఎక్కువగా నమోదవుతున్నాయి. పీఎం10, పీఎం2.5 పెరుగుదల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది.

విశాఖలో కాలుష్యం పెరగడానికి పరిశ్రమలు, వాహనాలు, నిర్మాణాలు, ఘన వ్యర్థాలతో పాటు నగరం బౌల్

... మిగతా 6వ పేజీలో

వాల్తేరు డీఆర్‌ఎంగా ఎండీఆర్‌ఎం మనోజ్ సాహూ

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):



మనోజ్ సాహూ

వాల్తేరు రైల్వే డివిజనల్ మేనేజర్ సౌరబ్ ప్రసాద్ లంచం తీసుకుంటూ సీబీఐకి దొరికిపోవడంతో ఆయన్ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. విశాఖలో అదనపు డీఆర్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న మనోజ్ సాహూ డీఆర్‌ఎంగా బాధ్యతలు నిర్వహించాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అయితే అందులో 'అదనపు బాధ్యతలు' అని ఎక్కడా పేర్కొనకపోవడం గమనార్హం. రెగ్యులర్ డీఆర్‌ఎంను నియమించేంత వరకూ లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు (ఏది ముందు అయితే అది) డీఆర్‌ఎంగా విధులు నిర్వహించాలని రైల్వే బోర్డు సూచించింది. గతంలో ఎప్పుడూ ఇలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని రైల్వే వర్గాల్లో చర్చ జరుగుతోంది.



తప్పులున్న బోర్డు

సేవల బోర్డులో తప్పులు

సింహాచలం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో జరిగే పలు ఆర్జిత సేవలకు సంబంధించి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రచార బోర్డులో పలు తప్పులు దొర్లాయి. స్వామివారి ఆభరణాల ప్రదర్శన శాల వద్ద ఏర్పాటు చేసిన ఈ బోర్డులో 9వ లైన్‌లో సహస్ర నామార్చనకు బదులు సహస్రమార్చన అని, 11వ లైన్‌లో గరుడసేవకు బదులు గరుడసేన అని, 13వ లైన్ స్వర్ణ తులసీ దళార్చనకు బదులుగా స్వర్ణ తులసీ దశార్చన అని రాసి ఉంది. దేవస్థానం అధికారులు కనీస బాధ్యతగా వహించకుండా బోర్డును తప్పులతో రాయించడం పట్ల భక్తులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

భీమునిపట్నం,నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య శిక్షణా సంస్థ ద్వారా బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ అందిస్తున్నామని స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ అన్నపూర్ణ తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందిస్తామన్నారు. ఆసక్తి గల వారు 9014758949 నంబరును సంప్రతించాలని ఆమె సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

భీమునిపట్నం,నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) :బీచ్‌లో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పోలీసులు గురువారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు సీఐ సుధాకర్, ఏఎస్‌ఐ రామం సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పేకాట ఆడుతున్న వారిని పట్టుకున్నారు. వారి నుంచి రూ. 1610 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు వారిపై కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు బాలిక ఎంపిక

తగరపువలస, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బంగ్లామెట్టకు చెందిన పి. కీర్తి జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికైంది. ఈమేరకు వచ్చే నెలలో మధ్యప్రదేశ్‌లోని బోపాల్‌లో జరిగే పోటీల్లో పాల్గొనుంది. ఏయూలో బుధవారం జరిగిన అంతర్ కళాశాలల పోటీల్లో ఆమె (78 కిలోల విభాగం) ప్రతిభ చూపడంతో నిర్వాహకులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ప్రస్తుతం ఆమె భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్నది. కాగా జాతీయ స్థాయి పోటీలకు హాజరుకానున్న కీర్తికి ప్రయాణ ఖర్చుల నిమిత్తం వీఎస్‌ఆర్ సంస్థ ప్రతినిధి శ్రీనివాసరెడ్డి గురువారం రూ. 6 వేల ఆర్థిక సహాయం అందించారు.

కార్మిక నాయకుడు చిల్ల శంకరరెడ్డికి నివాళి

తగరపువలస, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్ మిల్లు కార్మిక సంఘం నాయకుడు చిల్ల శంకరరెడ్డి 91వ జయంతి తగరపువలసలో ఉన్న కార్మిక సంఘం భవనంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు శంకరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మున్సిపల్ కౌన్సిలర్‌గా, జూట్‌మిల్లు కార్మిక సంఘం నాయకుడిగా ఆయన చేసిన సేవలను వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్మిక సంఘం అధ్యక్షుడు జేవీ కైలాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.ఆదినారాయణ, గండేల అప్పారావు, ఆదిరెడ్డి, జీరు అప్పలరెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం

తగరపువలస, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది.అధ్యక్షుడిగా సుత్తి శ్రీనివాసరావు, కార్యదర్శిగా లచ్చుబుగత గణపతిరావు, కోశాధికారిగా పి. రోజా, రాజు, రాజేష్, శివాజీ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కొమ్మాది, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని బక్కన్నపాలెం 11కేవీ ఏపీహెచ్‌బీఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు ఏఈ అప్పలనాయుడు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీహెచ్‌బీ కాలనీ, ఆర్‌హెచ్ కాలనీ, ఎఫ్‌సీఐ లేఅవుట్, షుగర్ కేన్ లేఅవుట్, పీఎం పాలెం, మూడవ బస్టాప్, కొమ్మాది సబ్‌స్టేషన్ ఎన్టీఆర్ ఫీడర్ పరిధిలోని పీహెచ్‌సీ సెంటర్, చైతన్య ఇంజనీరింగ్ కళాశాల, చైతన్య టెక్నో స్కూల్, కె2 కాలనీ, కె1 కాలనీ, కె3 కాలనీ, నవోదయ స్కూల్, అన్నంరాజునగర్, సాయి చంద్ర లేఅవుట్, గాయత్రి కళాశాల, అప్పల క్ష్మీదేవాలయం ప్రాంతాలకు సరఫరా ఉండదని ఆయన సూచించారు.

విశాలాక్షినగర్‌లో...

విశాలాక్షినగర్ : విశాలాక్షినగర్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా ఉండదని జోన్-3 ఈఈ పొలాకి శ్రీనివాసరావు తెలిపారు. జోడుగుళ్లపాలెం, రెవెన్యూ కాలనీ,కోదండ రామాలయం, దయాల్‌నగర్, చలపతినగర్, ఎస్సీఎస్టీ కాలనీ, విశాలాక్షినగర్, నాటుకోళ్ల అమ్మే ప్రాంతం, జూ పార్కు, ఇన్, అవుట్ గేట్, తహసీల్దార్ కార్యాలయం, వెటర్నరీ కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

అప్పన్న ఆలయంలో మాజీ ట్రస్టీల హవా

- అధికారం లేకపోయినా రాచమర్యాదలు
- వాహనం టోల్‌గేట్ నుంచి దర్శనం వరకూ అన్నీ ఉచితమే
- అధికారుల తీరుపై విమర్శలు



లిఫ్ట్ వద్ద నిరీక్షిస్తున్న మాజీ ట్రస్టీ, బంధువులు

సింహాచలం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అధికారం మారినా, తమ పదవీ కాలం ముగిసినా వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో పాలక మండలి మాజీ సభ్యులు కొందరు ఇంకా తమ హవా కొనసాగిస్తున్నారు. సింహగిరికి వారు వచ్చే వాహనం టోల్‌గేట్ నుంచి స్వామివారి దర్శనం, ఆశీర్వచనాలు, దండలు, ప్రసాదాలు అన్నీ రాచమర్యాదలతో ఉచితంగా పొందుతుండడం పట్ల భక్తులు విమర్శలు గుప్పిస్తున్నారు. గురువారం వేపగుంట ప్రాంతానికి చెందిన మాజీ ట్రస్టీ ఒకరు కార్పొరేటర్‌తో కలిసి మొత్తం ఎనిమిది మంది స్వామివారి దర్శనానికి వచ్చారు. వారంతా కార్లకు టోల్ గేటు టికెటు తీయకుండా, వృద్ధులు, గర్భిణిలు,దివ్యాంగుల కోసం ఉన్న లిఫ్ట్‌లో వెళ్లడం, అంతరాలయంలోకి వెళ్లే అతిశ్రీఘ్రదర్శనం (రూ.300) టికెట్లు తీసుకోకుండా ఉచితంగా ప్రవేశించి స్వామిని దర్శించుకోవడం, తిరిగి వచ్చి ఆర్జిత సేవగా ఉన్న వేదాశీర్వచనాలను కూడా ఉచితంగానే స్వీకరించడాన్ని భక్తులు విమర్శిస్తున్నారు. మాజీ ట్రస్టీలంతా వైసీపీకి చెందిన వారు కావడం, ఇప్పటికీ వారికి ఆలయ అధికారులు సకల రాజమర్యాదలు చేయడం పట్ల పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

పోరాటంతోనే సమస్యలు పరిష్కారం

మత్స్యకార దినోత్సవంలో నాయకులు



వృద్ధురాలికి చీర పంపిణీ చేస్తున్న మత్స్యకార నాయకులు

భీమునిపట్నం,నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి మత్స్యకారులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని జిల్లా మత్స్యకార నాయకుడు కోలా గురువులు పిలుపునిచ్చారు. గురువారం బీచ్‌రోడ్ 4వ వార్డు చొక్కవానిపాలెంలో ఉత్తరాంధ్ర మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో మత్స్యకారుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగైదు దశాబ్దాలుగా మత్స్యకారులను ఎస్టీల జాబితాలో చేర్చాలని పోరాడుతున్నా, ప్రభుత్వాలు స్పందించకపోవడం విచారకరమన్నారు. ఒడిశా, తమిళనాడు రాష్ట్రాలు మత్స్యకారులను ఎస్టీలుగా గుర్తించాయని, ఇక్కడ మాత్రం కనీసం పట్టించుకోకపోవడం మత్స్యకారుల పట్ల ప్రభుత్వాలు ఏ భావనతో ఉన్నాయో అర్థం చేసుకోవాలన్నారు. 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు మాట్లాడుతూ తీరంలో కెమికల్ ఫ్యాక్టరీల ఏర్పాటును ప్రపంచ దేశాలన్నీ నిషేధిస్తే మన రాష్ట్రంలో మాత్రం ఎందుకు అనుమతి ఇస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఫ్యాక్టరీలు విడుదల చేసే రసాయన వ్యర్థాలతో మత్స్య సంపద నాశనమైపోతుందని, దీనివల్ల మత్స్యకారుల జీవనోపాధికి విఘాతం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు చొక్కా భాస్కరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కోటికి పైగా మత్స్యకారులు ఉన్నా రాజకీయ పార్టీలు తగు ప్రాధాన్యత కల్పించడం లేదని చెప్పారు. కాగా అంతకముందు నాయకులు కేక్ కట్ చేసి, మహిళలకు, వృద్ధులకు చీరలు, దుప్పట్లు అందజేశారు.కార్యక్రమంలో మత్స్యకార నాయకులు కర్రి ఎర్రయ్య, కారి అప్పారావు, దూడ అచ్యుతరావు, దాసు, ఎల్లయ్య, విజయ్‌చందర్, ఎల్లయ్య, అమరనాథ్, నల్లబాబు పాల్గొన్నారు.

అయిదో వార్డులో జోన్ -2 జడ్సీ పర్యటన



వార్డు పర్యటనలో భాగంగా అధికారులకు సూచనలు ఇస్తున్న జడ్సీ సింహాచలం

కొమ్మాది, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 5వ వార్డులోని సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని జోన్-2 కమిషనర్ సింహాచలం తెలిపారు. గురువారం ఆయన కార్పొరేటర్ మొల్లి హేమలతతో కలిసి వార్డు పరిధిలోని కొండవాలు ప్రాంతాలైన అయ్యప్పనగర్, వివేకానందనగర్, ముత్యాలమ్మకాలనీ, గాంధీనగర్, శివశక్తినగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఇంటి పన్ను, వీధి లైట్లు, డ్రైనేజీలు, రోడ్లు, తాగు నీటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం జడ్సీ మాట్లాడుతూ వార్డులోని సమస్యలను నిధుల లభ్యత మేరకు దశల వారీగా పరిష్కరిస్తామని చెప్పారు. మాస్టర్ ప్లాన్ రోడ్డులోని అక్రమ దుకాణాలు, శ్మశానవాటికను ఆనుకుని ఉన్న అక్రమ బడ్డీలను అధికారులు పరిశీలించారు. బొట్టవానిపాలెం చెరువు అభివృద్ధి, డంపింగ్ యార్డు వల్ల మారికవలస, బోరవానిపాలెం, జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కార్పొరేటర్ హేమలత జడ్సీకి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు మొల్లి లక్ష్మణరావు, ఈఈ శాంతిరాజు, టౌన్ సర్వేయర్ ప్రభాకరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పార్కులో అభివృద్ధి పనులకు భూమి పూజ

కొమ్మాది, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. గురువారం ఆమె స్వతంత్రనగర్‌లో పార్కు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వార్డులో రూ. 10 కోట్లతో పార్కులు, రోడ్లు, తాగునీటి పైప్‌లైన్లు, కాలువలు, కొండవాలు ప్రాంతాలకు మెట్లు పనులు చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు మొల్లి లక్ష్మణరావు, వార్డు అధ్యక్షుడు నాగోతి సత్యనారాయణ, మన్యాల సోంబాబు, దేవర శివ, బోయి వెంకటరమణ, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ గుర్తింపు కార్డులతో ఇబ్బందులు

సింహాచలం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వస్తున్న భక్తుల్లో కొందరు నకిలీ గుర్తింపు కార్డులు తీసుకువస్తున్నారు. సాధారణంగా దేవస్థానంలో జరిగే పలు సేవలకు ప్రధానంగా నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష అంతకంటే అధికంగా విరాళం ఇచ్చిన దాతలను గౌరవిస్తూ ప్రత్యేక గుర్తింపు కార్డును దేవస్థానం అధికారులు జారీ చేస్తుంటారు. ఆ కార్డును పట్టుకుని వారు ఏడాదిలో ఒక్కసారి మాత్రమే ఉచిత దర్శ నం పొందవచ్చు. దీన్ని ఆసరాగా తీసుకుంటున్న కొందరు నకిలీ కార్డులతో స్వామివారి దర్శనానికి వస్తున్నారు.గురువారం ఒక భక్తుడు కలర్ గుర్తింపు కార్డుతో సతీసమేతంగా రాగా ఆ కార్డును ఆలయ అధికారులు తనిఖీ చేసి నకిలీదిగా గుర్తించారు. అన్నప్రసాద విభాగం జారీ చేసే పోస్టు కార్డు సైజు కాకుండా చాలా చిన్నదిగా ఉండడంతో పట్టుకున్నారు. అలాగే వారం రోజుల క్రితం మరో భక్తుడు విరాళానికి సంబంధించిన బాండ్‌ను కలర్ జిరాక్స్‌తో దర్శనానికి వచ్చినట్టు అధికారులు గుర్తించారు. ఇటువంటివి పునరావృతం కాకుండా ఏమి చేయాలో అధికారులు కసరత్తు చేస్తున్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం ర్యాలీ

మధురవాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పట్టణ పేదలకు రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. గురువారం మధురవాడ 53వ సచివాలయం పరిధి మిథిలాపురి వుడాకాలనీలో పార్టీ కార్యకర్తలతో కలిసి ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి సెంటు స్థలం ఇచ్చిందని, కానీ ఆ స్థలం సరిపోవడం లేదన్నారు. జగనన్న కాలనీలు కూడా జనావాసాలకు దూరంగా ఉండడం వల్ల ఎవరూ ఇళ్లు నిర్మించుకోలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వి. సత్యనారాయణ, బేగం, కుమార్, పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

అప్‌గ్రేడేషన్‌పై ఆశలు

... 5వ పేజీ తరువాయి

కంటి ఆస్పత్రి పోటీపడ్డాయి. ఇక్కడి ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు అప్పట్లో వేగంగా స్పందించడంతో ప్రక్రియ ముందుకుసాగింది. అప్‌గ్రేడ్ జరిగితే రెటీనా, కార్నియా, గ్లకోమా, స్క్వింట్ అండ్ ఆక్లోప్లాస్టియా (కంటి ప్లాస్టిక్ సర్జరీ) వంటి విభాగాలను ఏర్పాటుచేస్తారు. నిపుణులు, అధునాతన లేబొరేటరీ, అనస్థీషియా విభాగం, స్టాఫ్ నర్సులు, థియేటర్ అసిస్టెంట్లు, పారా మెడికల్ సిబ్బందిని కేటాయిస్తారు. నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్ (ఎన్‌పీసీబీ) రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకూ నిధులు ఇస్తుంది. ఆస్పత్రిలో ప్రస్తుతం ఉన్న పడకల సంఖ్య మూడు నుంచి నాలుగు రెట్లు పెరుగుతుంది. దీనివల్ల ఎక్కువమంది రోగులకు వైద్య సేవలందించేందుకు, శస్త్రచికిత్సలు చేసేందుకు వీలుంటుంది.

ముందుకు కదిలేనా..?

రాష్ట్రంలో ఎన్ని కంటి ఆస్పత్రులున్నప్పటికీ ఒక్క ఆస్పత్రినే కేంద్రం ఆర్‌ఐవోగా అప్‌గ్రేడ్ చేస్తుంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రతిపాదనకు మోక్షం లభిస్తుందని భావిస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దలు, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళితే ప్రయోజనం లభిస్తుందంటున్నారు. కర్నూలు ఆస్పత్రి అధికారుల్లోనూ ఇదే ఆలోచన ఉన్న నేపథ్యంలో ఇక్కడి ఎంపీలు, ఎమ్మెల్యేలు వేగంగా స్పందించాల్సి ఉంది. దీని గురించి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి వద్ద ప్రస్తావించగా ఇటీవల ఉన్నతాధికారులకు విషయం గుర్తుచేశామన్నారు. రాష్ట్రంలోని ఏ ఆస్పత్రికి ఆర్‌ఐవో అప్‌గ్రేడేషన్ దక్కలేదని, విశాఖకు లభించేలా తమవంతు కృషి చేస్తామన్నారు.

ట్రాఫిక్ ఎస్‌ఐపై సస్పెన్షన్ వేటు

... 5వ పేజీ తరువాయి

ఎస్‌ఐ భాస్కరరావు, రైటర్ జయరావును విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. పోలీస్ శాఖలో ఎవరైనా అవినీతి, అక్రమాలకు పాల్పడినట్టు తెలిస్తే 7995095799 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీపీ విజ్ఞప్తి చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహించినా, అవినీతికి పాల్పడినా కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

28 నుంచి వ్యర్థాల నిర్వహణపై సదస్సు

సాగర్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గీతం వర్సిటీ స్కూల్ ఆఫ్ బిజినెస్, ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఎయిర్ అండ్ వాటర్ సంస్థ సంయుక్తంగా ఈనెల 28 నుంచి డిసెంబర్ 1 వరకు వ్యర్థాల నిర్వహణపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు సదస్సు చైర్మన్ ప్రొఫెసర్ సాధన్ కె. ఘోష్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా పి. పప్పు తెలిపారు. గురువారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. సదస్సుకు 60 దేశాల నుంచి 600 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్టు తెలిపారు. అలాగే 580 పరిశోధన పత్రాలను వివిధ రంగాల నిపుణులు అందజేస్తారన్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ

కొమ్మాది, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటుందని రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు గొల్లంగి ఆనందబాబు అన్నారు. గురువారం ఆయన అమరావతిలో రూ. లక్ష ఆన్‌లైన్ ద్వారా చెల్లించి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఇక్కడి విలేకరులతో ఫోన్‌లో మాట్లాడుతూ శాశ్వత సభ్యత్వాల ద్వారా వచ్చిన సొమ్మును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ వడ్డీతో కార్యకర్తలకు సహాయం అందిస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆలోచనలు నచ్చి శాశ్వత సభ్యత్వం తీసుకున్నట్టు చెప్పారు.

ఉపాధి పనులు పరిశీలన



శొంఠ్యాంలో చెరువు పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఆనందపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆ పథకం ఈజీఎస్ డైరెక్టర్ వైవీకే షణ్ముక కుమార్ గురువారం పరిశీలించారు. ముందుగా శొంఠ్యాం పంచాయతీలో ఊట కుంటలు, ప్లాంటేషన్ పనులు, మినీ అమృత సరోవర్ చెరువు పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో అవకతవకలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. అర్హులై ఉండి జాబ్ కార్డు కావాలనుకునే వారిని గుర్తించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ పూర్ణిమ దేవి, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆంజనేయులు, ఎంపీడీవో డాక్టర్ జానకి, తదితరులు పాల్గొన్నారు.

'మోతాదుకు మించి యాంటీ బయోటిక్స్ వాడొద్దు'

ఎండాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : యాంటీ బయోటిక్స్ అవసరానికి మించి వినియోగించడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఫార్మాకాలజీ నిపుణుడు డాక్టర్ ఎ. శ్యామకుమార్ సూచించారు. యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) అవగాహన వారోత్సవాల్లో భాగంగా గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రిసెర్చ్ (జిమ్‌సర్), గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మితిమీరిన యాంటీ బయోటిక్స్ వినియోగం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా యాంటీబయోటిక్స్‌ను బాధ్యతగా ఉపయోగించాల్సి ఉందన్నారు.దీనిపై ప్రజలను, ఆరోగ్య కార్యకర్తలను చైతన్యం కలిగించడానికి వారోత్సవాలు నిర్వహించి నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ జగత్తరన్‌దాస్, ప్రొఫెసర్ పి. రామారావు, జిమ్‌సర్ ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ టి. తులసీమాధురి పాల్గొన్నారు.

గిరిజన చట్టాలపై అవగాహన

సాగర్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గిరిజనులు తమ జీవన విధానాన్ని, భూ హక్కులు, సహజ వనరులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని గిరిజన సాంస్కృతిక పరిశోధనా కేంద్రం ఈడీ డాక్టర్ రాణిమండా అన్నారు. రుషికొండ వద్ద ఉన్న గిరిజన సాంస్కృతిక పరిశోధనా కేంద్రంలో జన జాతీయ గౌరవ దివస్ వేడుకల్లో భాగంగా గురువారం గిరిజన చట్టాలు, ఆచారాలు, న్యాయ వ్యవస్థ అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లో అమలు చేస్తున్న చట్టాల గురించి వివరించారు. గిరిజనుల రక్షణ, మాతృభాషలో విద్యా బోధన, సాంస్కృతిక రక్షణపై అధికారులు ఎక్కువ దృష్టిసారించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వి. విజయలక్ష్మి, సదస్సు కోఆర్డినేటర్ డాక్టర్ పి. శంకర్రావు పాల్గొన్నారు.

ప్రసాదరెడ్డి అక్రమాలపై విచారణ చేపట్టాలి

... 5వ పేజీ తరువాయి

నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని వారిని గైడ్లుగా పెట్టి సీనియర్ ప్రొఫెసర్లను అవమానించారన్నారు. రూసా పథకం కింద కేంద్రం ఇచ్చిన నిధులను దుర్వినియోగం చేశారంటూ ఆరోపించారు. ఏయూలో రెగ్యులర్ ప్రొఫెసర్లను పక్కనపెట్టి ఎయిడెడ్ కాలేజీల నుంచి లెక్చరర్లను తెచ్చి ప్రొఫెసర్లుగా నియమించి సొంత సైన్యాన్ని తయారుచేసుకున్నారని పేర్కొన్నారు. గడిచిన ఐదేళ్లలో వర్సిటీని ఆయన భ్రష్టుపట్టించిన తీరుపై పత్రికలు కథనాలు ప్రచురించాయన్న పల్లా శ్రీనివాసరావు..ఆ వివరాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. వర్సిటీకి సంబంధించిన కీలక దస్త్రాలను మాయం చేశారని, వీటన్నింటిపై పూర్తిస్థాయి విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



పూజలో పాల్గొన్న భక్తులు
(స్వర్ణ పుష్పాల మధ్య స్వామివారు)

సింహాద్రినాథుడికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలు తీసి భక్తులతో స్పృశింపజేసి, బేడామండప ప్రదక్షిణ చేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శత నామాల పఠనంతో స్వర్ణ సంపెంగలతో పూజలు జరిపారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

రెవెన్యూ మంత్రి దృష్టికి పంచ గ్రామాల భూ సమస్య



మంత్రి సత్య ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సింహాచలం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పంచ గ్రామాల భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను సమైక్య ప్రజా, రైతు సంక్షేమ సంఘం నాయకులు కోరారు. గురువారం వారు అసెంబ్లీ ఆవరణలో మంత్రిని కలిసిన వినతిపత్రం అందజేశారు. సమస్య తీవ్రతను మంత్రికి సమగ్రంగా విశదీకరించారు. మంత్రిని కలిసిన వారిలో ఆ సంఘం కార్యదర్శి టివి కృష్ణంరాజు, ఎమ్మెల్సీ లక్ష్మణ్, తదిత రుల ఉన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు

భీమునిపట్నం (రూరల్), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో 8 నుంచి పిజి వరకు చదువుతున్న 112 మంది విద్యార్థులకు దివీస్ యాజమాన్యం రూ.7.69 లక్షల ఉపకార వేతనాలను గురువారం పంపిణీ చేసింది. చిప్పాడ గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెదనాగమయ్యపాలెం, అన్నవరం, మూలకుద్దు, నగరపాలెం, లింగాలవలస, తూడెం, చెరుకుపల్లి తదితర పంచాయతీలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దివీస్ డైరెక్టర్ ఎన్. దేవేందర్, ఉద్యోగులు ఎల్‌వీ రమణ, ఎం.ఎస్.ఎన్.రావు, రామకృష్ణ, వైఎస్ కోటేశ్వరరావు, నాయుడు, సురేశ్ కుమార్, నరసింహ, శ్రీనివాస్, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

అండర్ స్టాండింగ్!

... 5వ పేజీ తరువాయి

ఉన్నారు. వీరంతా ఉన్నప్పటికీ జోన్-3 పరిధిలోని 21వ వార్డు బీచ్‌రోడ్డులో పారిశుధ్య నిర్వహణకు 30 మంది కార్మికులను నెలరోజులపాటు నామినేషన్ పద్ధతిలో నియమించారని చెప్పి ఒక కాంట్రాక్టర్‌కు రూ.4.65 లక్షలు బిల్లు చెల్లించేందుకు ఎజెండాలో ప్రతిపాదించారు. అలాగే ప్రతి వార్డు సచివాలయానికి ఒక క్లాప్ వాహనం చెత్త తరలించేందుకు ఉండగా, చెట్ల వ్యర్థాలు, డెబ్రిస్ తరలించేందుకు జీవీఎంసీకి చెందిన వాహనాలు ప్రత్యేకంగా ఉన్నాయి. అయినప్పటికీ జోన్-2 పరిధిలోని ఐదు నుంచి 13వ వార్డు వరకూ చెట్ల వ్యర్థాలు తరలించేందుకు రెండు వాహనాలను నెల రోజులుపాటు పెట్టినందుకు కాంట్రాక్టర్‌కు రూ.4.48 లక్షలు చెల్లించాలంటూ ఎజెండాలో ప్రతిపాదించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అలాగే జోన్-2 పరిధి 5,6,7 వార్డుల్లో చెత్త సేకరించడానికి క్లాప్ వాహనాలకు అదనంగా మూడు టాటా ఏస్ వాహనాలను పెట్టిన కాంట్రాక్టర్‌కు రూ.4.86 లక్షలు చెల్లించాలని ఎజెండాలో చేర్చడం విశేషం. వీటన్నింటినీ స్టాండింగ్ కమిటీ సభ్యులు తిరస్కరించాలని భావించినప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్లకు ఫోన్ చేసి కొందరు సభ్యులు మాట్లాడగా పది శాతం కమీషన్ ఇచ్చేందుకు అంగీకరించడంతో వాటిని ఆమోదించాలని తీర్మానించుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. వీటితోపాటు జీవీఎంసీ పరిధిలో ఎక్కువ వెలుతురునిచ్చే సామర్థ్యం కలిగిన వీధి దీపాలు ఏర్పాటు, ప్రతి జోన్‌లో పాములు పట్టుకునేందుకు ఒక క్యాచర్‌ను రూ.పది వేల వేతనానికి నియమించుకోవడం, వీధికుక్కలను పట్టుకుని ఆపరేషన్లు చేసేందుకు వాహనాలను సమకూర్చుకోవడం, నగరంలో నిరాశ్రయుల షెల్టర్లలో పనిచేస్తున్న సిబ్బంది ఏడాదిపాటు పొడిగింపు, షెల్టర్‌లో ఉండేవారికి భోజనాలు సమకూర్చే అంశాలను ఎజెండాలో చేర్చారు. 70, 76, 96 వార్డుల్లో అభివృద్ధి పనులు, దుకాణాల వేలం వంటి అంశాలను ఎజెండాలో చేర్చారు.

తప్పుడు పత్రాలు సమర్పిస్తే కేసులు

... 5వ పేజీ తరువాయి

ఎవరో తెలుసుకుంటే చాలా వరకూ మోసపోకుండా ఉండడానికి అవకాశం ఉంటుంది.

ప్ర: ప్రజలకు స్టాంపు పేపర్లు అందుబాటులో తెచ్చారా?

జ: సుమారు రూ.1.2 కోట్ల విలువైన స్టాంపు పేపర్లు తొలి విడతలో తెప్పించాం. రూ.100 విలువైనవి 72 వేలు, రూ.50 విలువైనవి 80 వేలు, ఇంకా రూ.20, రూ.10 విలువ కలిగినవి కూడా తెప్పించాం. జిల్లాలోని తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోను అందుబాటులో ఉన్నాయి. స్టాంపు విక్రేతలకు కూడా ఇచ్చాం.

ప్ర: స్టాంపు పేపర్లను పాత తేదీలు వేసి విక్రయిస్తే ఏం చేస్తారు?

జ: గతంలో ఇలాంటివి జరిగేవి. ఇప్పుడు అవకాశం లేదు. దీనికి ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ తీసుకువచ్చారు. ఎవరికి స్టాంపు పేపర్ విక్రయించినా ఆన్‌లైన్‌లో పేరు, తేదీ నమోదు చేయాల్సిందే. కొన్నవారి మొబైల్ నంబరుకు ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేశాకే స్టాంపు పేపరు ఇవ్వాల్సి ఉంటుంది. ఎవరి దగ్గర ఎన్ని స్టాంపు పేపర్లు ఉన్నాయో కూడా లెక్క తెలిసిపోతుంది. స్టాకు ఉంచుకొని ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటాం. స్టాంపు విక్రేతలు ఇండెంట్ పెట్టాలన్నా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి.

ప్ర: ఈ స్టాంపింగ్ (జెరాక్స్) డాక్యుమెంట్‌కు స్వస్తి పలికినట్టేనా?

జ: కక్షిదారులు ఏది కోరుకుంటే దానిపైనే డాక్యుమెంట్ ఇస్తాం. ప్రభుత్వం నుంచి అయితే ఈ స్టాంపింగ్ ఆపేయాలని ఉత్తర్వులు రాలేదు. ఇప్పుడు అంతా రూ.100 స్టాంపు పేపర్లపైనే లావాదేవీలు రాసుకొని, వాటిపైనే డాక్యుమెంట్లు తీసుకుంటున్నారు.

పెరిగిన వాయు కాలుష్యం

... 5వ పేజీ తరువాయి

ఏరియాలో ఉండడం కారణాలుగా చెప్పవచ్చు. నగరం చుట్టూ ఉన్న కొండల కారణంగా విశాఖలో శీతాకాలం ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి. దీంతో పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్య కారకాలు పైకి వెళ్లకుండా భూమి ఉపరితలంపై ఉండిపోతున్నాయి. దీంతో వాతావరణంలో ధూళి కణాలు, సల్ఫర్ డై ఆక్సైడ్ వంటి ఉద్గారాలు పెరుగుతున్నాయి. ఇంకా నగరంలో ఏటేటా పెరుగుతున్న వాహనాల వల్ల ధూళి పెరుగుతుంది. అలాగే నగరంలో భవన నిర్మాణాలు సమయంలో యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ధూళి గాలిలో కలుస్తోంది. ఇదిలావుండగా నగరంలో కాలుష్య తీవ్రత తగ్గించడానికి కేంద్రం ఇచ్చిన నిధులను గత వైసీపీ ప్రభుత్వం దారిమళ్లించింది. చెట్ల పెంపకం విరివిగా చేపట్టాలన్న ప్రణాళిక తూతూమంత్రంగా కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో గతంతో పోల్చితే విశాఖపట్నంలో కాలుష్యం ఏడు రెట్లు పెరిగిందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గురువారం శాసనమండలిలో ఆందోళన వ్యక్తంచేశారు. కాలుష్య ప్రభావం తగ్గించేందుకు చర్యలు చేపట్టామన్నారు. దీనిపై పీసీబీ అధ్యయనం చేస్తోందని, 2025 జనవరిలో నివేదిక వస్తుందని...దానిని బట్టి తగిన కార్యాచరణ చేపడతామన్నారు. శీతాకాలంలో నగరంలో కాలుష్య తీవ్రతకు గట్టి చర్యలు తీసుకుంటున్నట్టు కాలుష్య నియంత్రణ మండలి ఈఈ పి.ముకుందరావు తెలిపారు. హెచ్‌పీసీఎల్‌లో తక్కువ సల్ఫర్ ఉన్న ముడి చమురు వాడాలని ఆదేశించామన్నారు. మిగిలిన కాలుష్య కారక పరిశ్రమల్ని అప్రమత్తం చేశామన్నారు.

☛ సంక్షిప్తంగా..

కృష్ణా కళాశాలలో రక్తదానం


రక్తదానం చేస్తున్న విద్యార్థులు, పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపకులు

మద్దిలపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) :డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్, లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ బి.సుజాత ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యువత సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు దుర్గాప్రసాద్, చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ అధికారి బి.సన్యాసిరావు, అధ్యాపకులు బాల మురళీ, కృష్ణారావు, ఆర్వీ నాయుడు, వేదవ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : హనుమంతవాక ఫీడర్ మరమ్మతులు చేపడుతుండడంతో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ (ఆపరేషన్స్) పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. చినగదిలి, పెదగదిలి, దీన్‌దయాళ్‌పురం, కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయం, ఎస్సీ కాలనీ, శాలిపేట తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోదారులు సహకరించాలని కోరారు.

క్లాత్ బ్యాగుల పంపిణీ

వెంకోజీపాలెం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) :స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఎంఎంటీసీ కాలనీలోని త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు వెంకన్న ప్రతిమలతో కూడిన గుడ్డ సంచులను ఆలయ కార్యదర్శి ఎం.సావిత్రి, కోశాధికారి కె.సుబ్బారాయుడు ఆధ్వర్యంలో భక్తులకు క్లాత్ సంచులు పంపిణీ చేపట్టారు. గురువారం ఆలయానికి విచ్చేసిన భక్తులకు సుమారు 100 మందికి ఈ సంచులను అందజేశారు. కార్యక్రమంలో మేనేజరు బి.సన్యాసిరావు, ఆలయ అర్చకులు వెంకటరమణాచార్యులు, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వస్త్రదానం


వస్త్రదానం చేస్తున్న సత్యసాయి భక్తులు

ఆరిలోవ, నవంబరు 21 : (ఆంధ్రజ్యోతి) ఆరిలోవ అంబేద్కర్ జంక్షన్‌లోని బీటీఆర్ నగర్‌లోని సత్యసాయిమందిరంలో ఈ నెల 21 నుంచి 23 వరకు భగవాన్ సత్యసాయిబాబా జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్నారు.ఈసందర్భంగా పేదలకు వస్త్ర, అన్నదానం చేశారు.

సినిమా గైడ్

● **మెకానిక్ రాఖీ:** మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
● **దేవకీనందన వాసుదేవ:** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
● **జీబ్రా :** శారద, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)
● **కంగువా :** సంగం, రమాదేవి, శ్రీరామ, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక)
● **లక్కీభాస్కర్:** వెంకటేశ్వర
● **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 36, వంకాయలు (తెలుపు)32, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 24, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 40, బీరకాయలు 34, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 34, క్యారెట్ 70 దొండకాయలు 34, బంగాళ దుంపలు 40, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)50, బరబాటి 30, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 36, దోస కాయలు 25, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 55, పొటల్స్ 44, కీర దోస 22, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడ దుంపలు 32, కంద 66, దేముడు చిక్కుడు 75, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
ఫారం ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

పూర్తయిన నిర్మాణం.. ప్రారంభానికి తాత్సారం

- ఆరేళ్ల క్రితం పూర్తయినా.. అందుబాటులోకి రాని మార్కెట్ యార్డు
- ఏర్పాట్లు పూర్తయినా ప్రారంభం కాని రైతుబజార్
- ప్రజా ప్రతినిధులు పట్టించుకోరు
- అధికారులు నిర్లక్ష్యం వీడరు
- రూ.లక్షల ప్రజాధనం వృథా


ఆరేళ్ల నుంచి ప్రారంభానికి నోచుకోని మార్కెట్ యార్డు



ఊడుతున్న పెచ్చులు.. దట్టంగా పెరిగిన తుప్పలు

ఆరిలోవ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో ఏర్పాటు చేసిన మార్కెట్ యార్డు ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో దీని నిర్మాణం వెనుక ఉద్దేశం నెరవేరక పోవడంతో పాటు రూ.లక్షల ప్రజాధనం వృథా అవుతోంది. సుమారు ఐదేళ్ల కిందట నిర్మించిన ఈ మార్కెట్ యార్డును ప్రారంభించాలన్న స్పృహ ప్రజా ప్రతినిధులు గాని, అధికారులకు గాని లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ ప్రాంతంలో వీరబ్రహ్మేంద్ర ఆలయానికి ఎదురుగా సుమారు రూ.55 లక్షలతో 2018లో మార్కెట్ నిర్మాణం చేపట్టారు. దీని నిర్మాణం 2019, ఫిబ్రవరిలో పూర్తయింది. వ్యాపార అవసరాల కోసం మొత్తం 50 షాపులను కూడా షెడ్ల రూపంలో నిర్మించారు. వీటిని పేదలకు కేటాయించడం ద్వారా వారికి ఆర్థికంగా ఆసరా ఇవ్వవచ్చనేది ఆలోచన. నిర్మాణం పూర్తయిన అనంతరం ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. అయితే ఆ ఏడాది ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభానికి నోచుకోలేదు. అప్పటి నుంచి ఈ యార్డుకు గ్రహణం పట్టినట్టు అయింది. దీన్ని ప్రారంభించేందుకు అధికారులు ప్రయత్నాలు చేయనేలేదు.

ఈ మార్కెట్ యార్డు నిర్మాణం పూర్తయి సుమారు ఆరేళ్లు కావస్తుండడం, వినియోగంలో లేకపోవడంతో పలు చోట్ల పాడైంది. అంతేకాకుండా నిరుపయోగంగా ఉండడంతో దట్టంగా తుప్పలు పెరిగిపోయాయి. దీంతో కొందరు ఆకతాయిలు చేరి గంజాయి తాగడం, పేకాట ఆడడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.

ఈ యార్డులో చిరు వ్యాపారాలు చేసేందుకు అనువుగా పెద్ద షెడ్లు నిర్మించి స్టాళ్ల ఏర్పాటు చేశారు. దీంతో యార్డు ప్రారంభమైతే కొందరికి ఉపాధి లభించే అవకాశం కూడా ఉంది. దీన్ని ప్రారంభిస్తే చిరు వ్యాపారాలు నిర్వహించేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు.

వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ మార్కెట్ యార్డు ప్రారంభోత్సవానికి ప్రజాప్రతినిధులు, అధికారులకు తీరికే లేకుండా పోయిందని స్థానికులు ఎద్దేవా చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలోనైనా దీని ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అయితే కొన్నిచోట్ల మరమ్మతులకు గురవడంతో బాగు చేయించి ప్రారంభించాల్సి ఉంటుంది. ఇలాగే వదిలివేస్తే పూర్తిగా పాడయ్యే ప్రమాదం ఉందని పలువురు అంటున్నారు.


తోటగరువులో ఏర్పాటు చేసి ప్రారంభించని రైతుబజార్

అందని ద్రాక్షలా రైతు బజార్..

కాగా, మార్కెట్ యార్డు నిధులతో తోటగరువు హైస్కూలుకు సమీపంలో గెడ్డకు ఆనుకొని సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ భూమిలో రూ.80 లక్షలతో ఆరిలోవలో రైతు బజారును ఏర్పాటు చేశారు. అయితే ఈ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు నిధులు మంజూరు చేయలేదు. దీంతో సదరు కాంట్రాక్టర్ రైతుబజార్‌ను మార్కెట్ యార్డును అప్పగించలేదు. దీనిపై ఎలాంటి పరిష్కారం గాని, చర్యలు తీసుకోవడంపై అధికారులు దృష్టి సారించలేదు. కానీ ఇంతవరకు ఆచరణ కాలేదు. ఈ రైతుబజార్‌లో 36 స్టాళ్లు నిర్మించారు. మూడు హోల్‌సేల్ కిరాణా షాపులు, కోల్డ్ స్టోరేజ్, కార్యాలయం భవనం, వెయిటింగ్ రూం నిర్మించారు. రైతుబజార్ ప్రారంభానికి నోచుకోకపోవడంతో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి అపరిశుభ్రం నెలకొంది.

కొన్ని నెలల కిందట విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఈ రైతుబజార్‌ను పరిశీలించి, ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మార్కెట్ యార్డు, రైతు బజార్ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు, చిరు వర్తకులు కోరుతున్నారు.

చిరు వ్యాపారాలకు అవకాశం కల్పించండి

సీఐటీయూ ఆధ్వర్యంలో 22వ వార్డు వ్యాపారుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న చిరు వర్తకులు, సీఐటీయూ నేత వెంకటరావు తదితరులు

మద్దిలపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డులో తొలగించిన చిరు వ్యాపారాలను యథావిధిగా నిర్వహించుకునేలా అనుమతులు ఇవ్వాలని సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వెంకటరావు కోరారు. చిరు వర్తకులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో వీధి వ్యాపారులు గురువారం మద్దిలపాలెం కళాభారతి నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అన్యాయంగా దుకాణాలు తొలిగించారని ఆరోపించారు. ఎక్కడైనా అధికారులు చిరు వ్యాపారాలను తొలిగిస్తే.. ప్రజాప్రతినిధులు అడ్డుకొంటారని, ఇక్కడ ప్రజాప్రతినిధే దుకాణాలు తొలిగించాలంటూ హైకోర్టు వరకు వెళ్లడం దుర్మార్గమన్నారు. ఓట్లేసి గెలిపించిన ప్రజలకు రోడ్డున పడేయడం సబబు కాదన్నారు. కార్పొరేటర్ మూర్తియాదవ్ నిర్వాకం వల్ల ఉపాధి కోల్పోయిన వారికి వ్యాపారాలు చేసుకోవడానికి అనుమతులివ్వాలని కోరారు. సుప్రీంకోర్టే నగరాల్లో వారంతపు సంతల నిర్వహణకు ఆదేశాలిచ్చిందన్నారు. నగరంలో అన్నీ ప్రాంతాల్లో వారాంతపు సంత నిర్వహిస్తున్నారన్నారు. కళాభారతి రోడ్డులో మాత్రం సంత పెట్టకుండా కార్పొరేటర్ మూర్తియాదవ్ అడ్డుకోవడం సరికాదన్నారు. రోడ్డు ఆక్రమణలు తొలగించాలని హైకోర్టు ఆదేశాలిచ్చేందే కాని సంత వద్దని చెప్పలేదన్నారు. అందుకే పిఠాపురంకాలనీలో సంత ఏర్పాటుకు జీవీఎంసీ అధికారులు అనుమతులు ఇవ్వాలని కోరారు.

ఏయూ ఐఏఎస్‌ఈలో ఫిలాసఫీ డే


వివేకానందుడికి నివాళి అర్పిస్తున్న నాగరాజకుమారి

వెంకోజీపాలెం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : ఏయూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్ (ఐఏఎస్ఈ) ప్రాంగణంలో గురువారం వరల్డ్ ఫిలాసఫీ డేని పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగరాజకుమారి ప్రసంగిస్తూ ఆధ్యాత్మిక జీవన విధానమే ఉన్నతమైనదన్నారు. ముఖ్య అతిథి, విశ్రాంత ఆచార్యులు మదన మోహన్ మాట్లాడుతూ రవీంద్రనాథ్ ఠాగూర్, అరవిందో, వివేకానందల యొక్క ఆధునిక తత్వం గొప్పతనాన్ని, వారు చెప్పిన ఉన్నత విలువల్ని గురిచిఇ వివరించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ తిరుమలాంబ, సహ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

సమస్యల పరిష్కారం కోసం విశాఖ డెయిరీ కార్మికుల దీక్షలు


నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేతన సవరణతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విశాఖ డెయిరీ కార్మికులు సంస్థ మెయిన్ గేటు వద్ద గురువారం రిలే నిరాహార దీక్షలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా విశాఖ డెయిరీ కో-ఆపరేటివ్ ఎంప్లాయిస్‌యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.రమణ మాట్లాడుతూ గత 24 ఏళ్లుగా కార్మికులకు కనీస వేతనాలతో పాటు ఎటువంటి కనీస హక్కులు కల్పించకుండా డెయిరీ యాజమాన్యం కార్మికుల శ్రమను దోచుకోవడం దారుణమన్నారు. ఈ నెల ఒకటిన తమ తమ డిమాండ్లను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లితే ఏ ఒక్కదానికి అంగీకారం తెలపకపోవడంతో తాము రిలే నిరాహార దీక్షలకు దిగామన్నారు. యూనియన్ అధ్యక్షుడు కె.వరహామూర్తి మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను డెయిరీ యాజమాన్యం త్వరగా పరిష్కరించకపోతే డిసెంబరు ఐదో తేదీ తర్వాత డెయిరీలోని అన్ని విభాగాల కార్మికులు విధులు బహిష్కరించి ఆందోళనకు దిగుతారని హెచ్చరించారు. దీక్షల్లో యూనియన్ నాయకులు ఈశ్వరరావు, భాస్కరరావు, నాగ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు. కాగా డెయిరీ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు సీఐటీయూ బెల్ హెచ్‌పీవీపీ నాయకులు జీటీపీ ప్రకాశ్, సనపల జగన్నాథరావు, అప్పారావు, తదితరులు సంఘీభావం తెలిపారు.


ఆచార్య బీఆర్ రావుకు నివాళి అర్పిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు, ఆచార్యులు

ఆచార్య బీఆర్ రావుకు ఘన నివాళి

వెంకోజీపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో బీఆర్ రావు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిజిక్స్ విభాగం వద్ద ఉన్న బీఆర్ రావు విగ్రహానికి ఏయూ వీసీ జి.శశిభూషణరావు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ రావు అనేక సంవత్సరాలు శాస్త్రీయ పరిశోధన, విద్యా రంగంలో అందించిన అద్భుతమైన సేవల వల్ల ప్రపంచం ఇప్పటికీ ఆయనను గుర్తుంచుకుందన్నారు. ఏయూలో స్పేస్ ఫిజిక్స్ ల్యాబరేటరీ ఏర్పాటు చేయడంలో రావు కృషి అభినందనీయమన్నారు. యూజీసీ వైస్ చైర్మన్‌గా, రాజ్యసభ సభ్యుడిగా, భట్నాగర్ అవార్డు గ్రహీతగా ఏయూకు జాతీయస్థాయిలో విశేష గుర్తింపును తీసుకొచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

అందరూ చూడదగ్గ సినిమా 'మెగాస్టార్ ఫ్యాన్'


మీడియాతో మాట్లాడుతున్న చిత్ర యూనిట్

పెదవాల్తేరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అందరూ చూడదగ్గ సినిమా 'మెగాస్టార్ ఫ్యాన్' అని ఆ చిత్ర డైరెక్టర్ కిరణ్ వారియర్ అన్నారు. అల్లు ప్రొడక్షన్ బ్యానర్‌పై కిరణ్ వారియర్ దర్శకత్వంలో లుక్స్ రాజ్ హీరోగా, సై ఫేమ్ సూర్య ప్రధాన పాత్రలో ఈ చిత్రం నిర్మితమైంది. ఈ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా గురువారం స్థానిక అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కిరణ్ వారియర్ మాట్లాడుతూ ఈ సినిమా 29న విడుదల చేస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో యువ హీరో కంచర్ల ఉపేంద్ర, హీరో లుక్స్ రాజ్, నటుడు సూర్య, రెండో హీరోయిన్లు సోనిరెడ్డి, భువన సీత, ఎడిటర్ శ్యామ్ కుమార్, నటుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలు


విజేతలతో సింహాద్రి హెచ్‌వోపీ సమీర్‌శర్మ, తదితరులు

పరవాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో గురువారం రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలు జరిగాయి. 'ఎనర్జీ కన్జర్వేషన్ టు ప్రొటెక్ట్ ద ఎన్విరాన్‌మెంట్' అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఏ-గ్రూప్ నుంచి వి.రౌనక్‌కుమార్ (ప్రెసిడెన్షియల్ స్కూల్, సీతమ్మధార), బోడా సూర్య వెంకటచరణ్ (శ్రీ సత్యసాయి గురుకులం, రాజమండ్రి),బి.జీనర్ ప్రణీత (టీపసీ సీనియర్ సెకెండరీ స్కూల్, విశాఖపట్నం), బి- గ్రూప్ నుంచి తాన్యాగోసోమి (బాలభారతి పబ్లిక్ స్కూల్, సింహాద్రి), సీహెచ్ భావజ్ఞ (శ్రీప్రకాష్ విద్యానికేతన్), ధనలక్ష్మి (డీపీవీ పబ్లిక్ స్కూల్, ఉక్కునగరం) విజేతలుగా నిలిచారు. ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ రూ.30వేలు, తృతీయ రూ.20వేలు, కన్సొలేషన్ బహుమతి రూ.7,500 చొప్పున ప్రకటించారు. కార్యక్రమంలో సింహాద్రి జీఎంలు గడ్డంనోవా, రష్మీరంజన్ పరిదా, ప్రశాంత్‌కుమార్‌జీనా, హెచ్‌ఆర్ హెడ్ బీబీ పాత్ర, సీఎస్ఆర్ అధికారి కె.ప్రకాశరావు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్ విద్యార్థులకు అపార అవకాశాలు


మల్లాది శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న ఆచార్యులు కోటిరెడ్డి, రవి తదితరులు

వెంకోజీపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో ఉద్యోగి జీవిత ఇతివృత్తంపై గెస్ట్ లెక్చర్ ఉపన్యాసాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా హైదరాబాద్ డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ కార్పొరేట్ అఫైర్స్ అండ్ హ్యూమన్ రిలేషన్స్ అఫైర్స్ అసోసియేట్ డైరెక్టర్ మల్లాది శ్రీకాంత్ హాజరై హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు విస్తృత ఉపాధి అవకాశాలు ఉంటాయని, ఆ అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే ఎవరికివారు ప్రశ్నించుకొని సిద్ధం కావాలన్నారు. డిపార్టుమెంట్ ఆఫ్ ఇన్వెస్టుమెంటేషన్‌విభాగాధిపతి కోటిరెడ్డి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ జాలాది రవి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు మెరుగైన విద్య, వైద్యం అందించాలి


మాట్లాడుతున్న రమేశ్

రామ్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకార సామాజిక వర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే వారికి మెరుగైన విద్య, వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని జనసేన పార్టీ మత్స్యకార నాయకుడు చీకటి రమేష్ అన్నారు. గురువారం మత్స్యకార దినోత్సవం సందర్భంగా మత్స్యకారుల అభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు ఐకమత్యంతో ముందుకు వెళ్లటం ద్వారా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మత్స్యకార నాయకులు, పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.

జీవీఎంసీ పీజీఆర్ఎస్ నమోదు కౌంటర్లు పరిశీలన

వెంకోజీపాలెం,నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీకి ప్రతి సోమవారం నమోదవుతున్న ప్రజా వినతులు, ఫిర్యాదులను పూర్తి వివరాలతో క్లుప్తంగా నమోదు చేయాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి అన్నారు. గురువారం ఆయన అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణతో కలిసి జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల పీజీఆర్ఎస్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు.

నమోదవుతున్న ఫిర్యాదులను అన్ని విభాగాలకు సంబంధించిన అధికారులు, ఉద్యోగులు తెలుసుకుని పరిష్కరించేందుకు వీలుగా ఒక ప్రత్యేకమైన వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.


వీసీ శశిభూషణరావును కలిసిన వీసీటీపీఎల్ జీఎం ఎంఎన్ రావు

ఏయూలో మొక్కల పెంపకానికి వీసీటీపీఎల్ సుముఖం

వెంకోజీపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో విస్తృత స్థాయిలో మొక్కలు పెంచేందుకు విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేటు లిమిటెడ్ (వీసీటీపీఎల్) ముందుకు వచ్చింది. గురువారం ఏయూ వీసీ జి.శశిభూషణరావుతో వీసీటీపీఎల్ సీనియర్ జీఎం ఎంఎన్ రావు, ఏఎం ధనుంజయ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీరు ఏయూలో ఒక ప్రత్యేకమైన స్థలంలో విస్తృత స్థాయిలో మొక్కల నాటుతామని వెల్లడించారు. మొక్కలు నాటడానికి అవసరమైన స్థలాన్ని గుర్తించి ఏయూ అధికారులు తమకు అప్పగిస్తే అవసరమైన మొక్కలను నాటి, పెంచే కార్యక్రమాన్ని సైతం చేపడతామన్నారు. ఈ సందర్భంగా ఏయూకు సహకారం అందించేందుకు ముందుకు వచ్చిన వీసీటీపీఎల్ అధికారులకు ఈ ప్రతిపాదనను పంపిన టెర్మినల్ హెడ్ కెప్టెన్ సుదీప్ బెనర్జీలకు వీసీ కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో ఇందుకు సంబంధించిన పనులను ప్రారంభిద్దామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏయూ వృక్షశాస్త్రం విభాగాచార్యులు, హార్టికల్చరల్ విభాగం డీన్ ఎస్బీ పడాల్, డాక్టర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బీవీ రామారావు సేవలు చిరస్మరణీయం


రామారావుకు నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు తదితరులు

సిరిపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దివంగత బీవీ రామారావు సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు.గురువారం పారిశ్రామికవేత్త బీవీ రామారావు సంస్మరణ సభను ఆయన నివాస ప్రాంగణంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య హాజరై చిత్ర పటానికి నివాళులర్పించారు.పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా అనేక మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా రామారావు ఉపాధి కల్పించారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో బీవీ రామారావు సతీమణి బులుసు సతీసావిత్రి, కుమారుడు బలుసు వెంకటరామ్, రాధిక, ధన్వి, రామినేని వసంతలక్ష్మి తదితరులు నివాళులర్పించారు.

నేటి నుంచి సోలార్ ఎక్స్‌పో


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మద్దిలపాలెం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): దేశంలో సౌరవిద్యుత్ ఉత్పత్తి శాతం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గత ఏడాది సోలార్ విద్యుత్ ను 5.5 శాతం ఉత్పత్తి చేసి ప్రపంచంలోనే మూడో అతిపెద్ద సౌరవిద్యుత్ జనరేటర్‌గా అవతరించింది. ఇందులో భాగంగా పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం అమలుచేస్తోందని ఏపీ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు హేమకుమార్ చెప్పారు. ఈ మేరకు ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ సౌరవిద్యుత్ వినియోగానికి కేంద్రం చేపడుతున్న చర్యలు, అమలుచేస్తున్న పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి వీలుగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో రీనెక్స్ పేరుతో సోలార్ రెన్యూవబుల్ ఎనర్జీ ఎక్స్‌పో-24ను ఈనెల 22 నుంచి 24 వరకు నిర్వహిస్తున్నామన్నారు. నెలకు 150 లోపు యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వారు 1.2 కిలోవాట్ల రూఫ్‌టాప్, 150 నుంచి 300 యూనిట్ల వినియోగానికి 2 నుంచి 3 కిలోవాట్ల సామర్థ్యం గల రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కేంద్రం కిలోవాట్ రూఫ్‌టాప్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60వేలు, ఆపై రూ.78 వేలు సబ్సిడీ ఇస్తుందన్నారు. రుణాలిచ్చే బ్యాంకులు కూడా స్టాల్స్ ఏర్పాటు చేస్తాయన్నారు. ప్రదర్శనలో నగరవాసులు పాల్గొని పూర్తి సమాచారం తెలుసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామమోహనరావు, ఉపాధ్యక్షుడు నాగరాజు, కోశాధికారి జయబాబు, తదితరులు పాల్గొన్నారు.

మహా సభ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నేతలు

ఆరిలోవ, నవంబరు 21 : (ఆంధ్రజ్యోతి) : అఖిల పక్ష కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, రైతు కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఈ నెల 26న నిర్వహించనున్న మహా సభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ఆరిలోవ నేతలు కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను హనుమంతవాక జంక్షనులో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆరిలోవ ఏరియా సీపీఐ కార్యదర్శి కె.లక్ష్మణరావు, ఆటో యూనియన్ జిల్లా నాయకులు ఎస్.సూరిబాబు, జీఎస్ రాజేశ్, సుధ, జీకే రెడ్డి, గంగ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు నిరుద్యోగ జేఏసీ ధన్యవాదాలు

అక్కయ్యపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే 20 లక్షల ఉద్యోగాల హామీ అమలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు కు ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. నిప్పాన్ స్టీల్‌ప్లాంట్ ద్వారా 21 వేల ఉద్యోగాలు, ఎల్జీ ద్వారా 1495 ఉద్యోగాలు, డిఫెన్స్ మ్యాను ఫ్యాక్చరింగ్ కల్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్ ద్వారా 566, ఫిలిప్స్ కార్బన్ ద్వారా 200, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ ద్వారా 2381 ఉద్యోగాలను రాష్ట్రంలో యువతకు అందేందుకు ప్రయత్నాలు చేయడం హర్షణీయమన్నారు. యువత అభివృద్ధి దేశానికి వెన్నుముక అన్నారు. వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించడం, యువతకు ఉపాధిపై దృష్టి పెట్టకపోవడం వల్లే ప్రజల విశ్వాసం పొందలేకపోయిందన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. దాలిరాజు సూపర్ మార్కెట్, జగ్గారావు బ్రిడ్జి, యలమంచిలివారి వీధి, శివరామరెడ్డి స్వీట్స్ షాప్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

పోర్టు అథారిటీ మాజీ క్రీడాధికారి షేక్ సులేమాన్ మృతి



విశాఖపట్నం, స్పోర్ట్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం పోర్టు అథారిటీ మాజీ క్రీడాధికారి షేక్ సులేమాన్ (85) గురువారం గుండెపోటుతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్‌గా 1969లో పోర్టులో ఉద్యోగంలో చేరిన ఆయన 1981లో క్రీడాధికారిగా పదోన్నతి పొందారు. ఆయన పదవీకాలంలో బాస్కెట్‌బాల్ కోర్టు, అథ్లెటిక్స్ ట్రాక్, బ్యాడ్మింటన్ ఇండోర్ కోర్టులు, జిమ్నాజియం వంటి క్రీడా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడంలో కృషి చేయడమే కాకుండా వందలాది మంది క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కల్పించారు. 1997, జూన్ 30న లో పదవీ విరమణ పొందిన ఆయన పోర్టు అథారిటీలో కన్నా ముందు నగరంలోని 104 ఏరియాలోని కేంద్రీయ విద్యాలయంలో పీఈటీగా పనిచేశారు. అథ్లెటిక్స్ కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో నిపుణుడిగా పేరొందారు. క్రీడాకారునిగా 1963-64లో ఆంధ్ర విశ్వవిద్యాలయం అథ్లెటిక్స్ కబడ్డీ జట్లకు ప్రాతినిధ్యం వహించారు. అలాగే జాతీయ వాలీబాల్, కబడ్డీ టోర్నీలలో పాల్గొన్న రాష్ట్ర జట్లకు అనేకసార్లు మేనేజర్‌గా వ్యవహరించారు. షేక్ సులేమాన్ భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కులగణనతోనే సామాజిక న్యాయం

» దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రభాకర్ తదితరులు

సీతంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దేశంలో కులగణనతోనే సామాజిక న్యాయం సాధ్యమని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ స్పష్టం చేశారు. రామాటాకీస్ రోడ్డులో గల అంబేడ్కర్ భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుల గణనన అంశంపై మేధావులతో ఈ నెల 23న అంబేడ్కర్ భవన్‌లో ఉదయం 10 గంటలకు సమావేశాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. రిజర్వేషన్లు కేవలం ప్రభుత్వ రంగానికి పరిమితం చేయడం న్యాయం కాదని, ప్రైవేటు రంగానికి వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గుబ్బల రాంబాబు, కోలా హరిబాబు, సరస్వతి, గొడుగు రాజు, బత్తుల గౌతంబాబు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలతో జ్ఞానసముపార్జన

» మాగ్నా ఇంటర్నేషనల్ సీఈవో డైరెక్టర్ సీతారామస్వామి



విద్యార్థులతో ముచ్చటిస్తున్న సీతారామస్వామి

సీతంపేట, నవంబరు 21 : యువత మంచి పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మాగ్నా ఇంటర్నేషనల్ సీఈవో డైరెక్టర్ సీతారామస్వామి కోటగిరి పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో గ్రంథాలయ సొసైటీ, సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ నిర్వహణలో 'కమింగ్ టుగెదర్ ఫర్ డెసిమినేషన్ ఆఫ్ నాలెడ్జ్' అంశంపై ప్రసంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాగ్నా ఇంటర్నేషనల్ సీఈవో సీతారామస్వామి మాట్లాడుతూ..తాను కర్ణాటకలో బిట్స్ పిలానిలో చదువుకొని మెకానికల్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రులై అమెరికాలో చిన్న చిన్న ఉద్యోగాలు చేశానన్నారు. కష్టపడి సంపాదించుకోవడానికి ఎవరూ సంకోచించనక్కరలేదన్నారు. అమెరికాలో వివిధ కంపెనీల్లో పనిచేసి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని స్వయం కృషితో ఎదిగానని తెలిపారు. జనరల్ మోటార్స్‌లో ఉన్నత పదవిలో పని చేసి లక్ష మందికిపైగా ఉద్యోగులతో ప్రపంచంలో మూడో పెద్ద ఆటోమొబైల్ కంపెనీ సీఈవో స్థాయికి ఎదిగానన్నారు. కఠోర శ్రమ, లక్ష్య సాధన దీక్ష, వృత్తిపట్ల అకింత భావం ఉండాలని తెలిపారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఆత్మ విశ్వాసమే మనల్ని గెలిపిస్తుందని, ఫలితం ఆశించకుండా మంచి కోసం పని చేయాలని సందేశమిచ్చారు. అంతకుముందు ఆయన విశాఖ పౌర గ్రంథాలయాన్ని వీక్షించారు. సొసైటీ కార్యదర్శి డీఎస్ వర్మ గ్రంథాలయం అందిస్తున్న సేవలు, పాఠకులకు అందుబాటులో ఉంచిన సదుపాయాలు, పుస్తకాలు, నిర్వహిస్తున్న కార్యక్రమాలను సీతారామస్వామికి వివరించారు. విద్యార్థులతో సీతారామ స్వామి ముచ్చటించారు. గ్రంథాలయ సొసైటీ ఉపాధ్యక్షులు టీఎస్ఆర్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఆచార్య ఎ.ప్రసన్న కుమార్, ప్రధాన కార్యదర్శి డీఎస్ వర్మ, కార్యదర్శి డాక్టర్ డీవీ సూర్యారావు, గ్రంథపాలకులు దుర్గారాణి, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్వారకా క్రైమ్ పోలీసు స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ లతామాధురి



సిబ్బందికి సూచనలు అందిస్తున్న డీసీపీ (క్రైమ్స్) లతామాధురి

సీతంపేట, నవంబరు 21 : ద్వారకా పోలీసు స్టేషన్‌లో క్రైమ్ విభాగాన్ని డీసీపీ క్రైమ్స్ లతామాధురి గురువారం సందర్శించారు. రికార్డులు పరిశీలించి, కేసుల వివరాలను తెలుసుకున్నారు. త్వరితగతిన కేసులు డిటెక్ట్ చేయాలని, నేరాలు జరగకుండా పోలీసింగ్ విధులను సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు. సిబ్బందికి పలు అంశాల్లో సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ మోహనరావు, సీఐ బంగారుపాప పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి : ఏఐటీసీయూ

సీతమ్మధార, నవంబరు 21 : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని, అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పడాల గోవింద్ పిలుపునిచ్చారు. గురువారం సీతమ్మధార కూడలిలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్‌ను గోవింద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దేశానికి మూడోసారి ప్రధాని అయిన మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ అంబానీ, అదాని లాంటి కార్పొరేట్ దిగ్గజాలకు తాకట్టు పెడుతూ కార్మికులు, ఉద్యోగులకు తీరని ద్రోహం చేస్తోందని మండిపడ్డారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా, ముడి సరుకులు సరఫరా చేయకుండా ప్రైవేటుపరం చేయాలని కుట్ర పన్నుతోందన్నారు. కార్మికుల సమస్యలు తెలుపుతూ తమ డిమాండ్లతో ఈ నెల 26న అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో డీఆర్ఎం కార్యాలయం నుంచి జీవీఎంసీ వరకు జరిగే ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్.మధురెడ్డి, రావి అశోక్, శ్రీను, శివ, సతీష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీపై సభా సంఘం సముచిత నిర్ణయం

» కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్



సీతంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విశాఖ డెయిరీ అక్రమాలపై అసెంబ్లీలో చర్చ జరిపి సభా సంఘం వేయడం సముచిత నిర్ణయమని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ పేర్కొన్నారు. ద్వారకానగర్‌లో గల పౌర గ్రంథాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ డెయిరీలో జరిగిన అక్రమాలపై పూర్తి స్థాయిపై విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. కొక్కిరాపల్లిలో 20 ఎకరాల డెయిరీ భూమిని ఆడారి కుటుంబం అక్రమించుకొందని, పాల ధరపై పాడి రైతులకు ఇచ్చే డబ్బుల్లో రూ.మూడు తగ్గించేశారని ఆరోపించారు. ప్రస్తుతం ఛైర్మన్‌గా ఉన్న ఆడారి ఆనంద్, అతని కుటుంబ సభ్యుల అవినీతి, విశాఖ డెయిరీ డైరెక్టర్ ఆస్తులపై పూర్తి విచారణ చేపట్టాలని మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కేసులో తప్పించుకు తిరుగుతున్న అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన నిందితుడు గొల్లోరి కేశవరావును రైల్వే పోలీసులు గురువారం పట్టుకున్నారు. ప్లాట్‌ఫామ్‌పై తనిఖీలు చేస్తుండగా, అదే సమయంలో గంజాయి రవాణాకు రెక్కీ నిర్వహిస్తున్న కేశవరావు పట్టుబడ్డాడని రైల్వే పోలీసులు తెలిపారు. అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ధనుంజయనాయుడు పేర్కొన్నారు.

పెరిగిన వాయు కాలుష్యం

... 5వ పేజీ తరువాయి

ఏరియాలో ఉండడం కారణాలుగా చెప్పవచ్చు. నగరం చుట్టూ ఉన్న కొండల కారణంగా విశాఖలో శీతాకాలం ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి. దీంతో పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్య కారకాలు పైకి వెళ్లకుండా భూమి ఉపరితలంపై ఉండిపోతున్నాయి. దీంతో వాతావరణంలో ధూళి కణాలు, సల్ఫర్ డై ఆక్సైడ్ వంటి ఉద్గారాలు పెరుగుతున్నాయి. ఇంకా నగరంలో ఏటేటా పెరుగుతున్న వాహనాల వల్ల ధూళి పెరుగుతుంది. అలాగే నగరంలో భవన నిర్మాణాలు సమయంలో యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ధూళి గాలిలో కలుస్తోంది. ఇదిలావుండగా నగరంలో కాలుష్య తీవ్రత తగ్గించడానికి కేంద్రం ఇచ్చిన నిధులను గత వైసీపీ ప్రభుత్వం దారిమళ్లించింది. చెట్ల పెంపకం విరివిగా చేపట్టాలన్న ప్రణాళిక తూతూమంత్రంగా కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో గతంతో పోల్చితే విశాఖపట్నంలో కాలుష్యం ఏడు రెట్లు పెరిగిందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గురువారం శాసనమండలిలో ఆందోళన వ్యక్తంచేశారు. కాలుష్య ప్రభావం తగ్గించేందుకు చర్యలు చేపట్టామన్నారు. దీనిపై పీసీబీ అధ్యయనం చేస్తోందని, 2025 జనవరిలో నివేదిక వస్తుందని..దానిని బట్టి తగిన కార్యాచరణ చేపడతామన్నారు. శీతాకాలంలో నగరంలో కాలుష్య తీవ్రతకు గట్టి చర్యలు తీసుకుంటున్నట్టు కాలుష్య నియంత్రణ మండలి ఈఈ పి.ముకుందరావు తెలిపారు. హెచ్‌పీసీఎల్‌లో తక్కువ సల్ఫర్ ఉన్న ముడి చమురు వాడాలని ఆదేశించామన్నారు. మిగిలిన కాలుష్య కారక పరిశ్రమల్ని అప్రమత్తం చేశామన్నారు.

అప్‌గ్రేడేషన్‌పై ఆశలు

... 5వ పేజీ తరువాయి

కంటి ఆస్పత్రి పోటీపడ్డాయి. ఇక్కడి ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు అప్పట్లో వేగంగా స్పందించడంతో ప్రక్రియ ముందుకుసాగింది. అప్‌గ్రేడ్ జరిగితే రెటీనా, కార్నియా, గ్లకోమా, స్క్వింట్ అండ్ ఆక్లోప్లాస్టియా (కంటి ప్లాస్టిక్ సర్జరీ) వంటి విభాగాలను ఏర్పాటుచేస్తారు. నిపుణులు, అధునాతన లేబొరేటరీ, అనస్థీషియా విభాగం, స్టాఫ్ నర్సులు, థియేటర్ అసిస్టెంట్లు, పారా మెడికల్ సిబ్బందిని కేటాయిస్తారు. నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్ (ఎన్‌పీసీబీ) రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకూ నిధులు ఇస్తుంది. ఆస్పత్రిలో ప్రస్తుతం ఉన్న పడకల సంఖ్య మూడు నుంచి నాలుగు రెట్లు పెరుగుతుంది. దీనివల్ల ఎక్కువమంది రోగులకు వైద్య సేవలందించేందుకు, శస్త్రచికిత్సలు చేసేందుకు వీలుంటుంది.

ముందుకు కదిలేనా..?

రాష్ట్రంలో ఎన్ని కంటి ఆస్పత్రులున్నప్పటికీ ఒక్క ఆస్పత్రినే కేంద్రం ఆర్ఐవోగా అప్‌గ్రేడ్ చేస్తుంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రతిపాదనకు మోక్షం లభిస్తుందని భావిస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దలు, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళితే ప్రయోజనం లభిస్తుందంటున్నారు. కర్నూలు ఆస్పత్రి అధికారుల్లోనూ ఇదే ఆలోచన ఉన్న నేపథ్యంలో ఇక్కడి ఎంపీలు, ఎమ్మెల్యేలు వేగంగా స్పందించాల్సి ఉంది. దీని గురించి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి వద్ద ప్రస్తావించగా ఇటీవల ఉన్నతాధికారులకు విషయం గుర్తుచేశామన్నారు. రాష్ట్రంలోని ఏ ఆస్పత్రికి ఆర్ఐవో అప్‌గ్రేడేషన్ దక్కలేదని, విశాఖకు లభించేలా తమవంతు కృషి చేస్తామన్నారు.

ట్రాఫిక్ ఎస్ఐపై సస్పెన్షన్ వేటు

... 5వ పేజీ తరువాయి

ఎస్ఐ భాస్కరరావు, రైటర్ జయరావును విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. పోలీస్ శాఖలో ఎవరైనా అవినీతి, అక్రమాలకు పాల్పడినట్టు తెలిస్తే 7995095799 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీపీ విజ్ఞప్తి చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహించినా, అవినీతికి పాల్పడినా కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

ప్రసాదరెడ్డి అక్రమాలపై విచారణ చేపట్టాలి

... 5వ పేజీ తరువాయి

నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని వారిని గైడ్లుగా పెట్టి సీనియర్ ప్రొఫెసర్లను అవమానించారన్నారు. రూసా పథకం కింద కేంద్రం ఇచ్చిన నిధులను దుర్వినియోగం చేశారంటూ ఆరోపించారు. ఏయూలో రెగ్యులర్ ప్రొఫెసర్లను పక్కనపెట్టి ఎయిడెడ్ కాలేజీలనుంచి లెక్చరర్లను తెచ్చి ప్రొఫెసర్లుగా నియమించి సొంత సైన్యాన్ని తయారుచేసుకున్నారని పేర్కొన్నారు. గడిచిన ఐదేళ్లలో వర్సిటీని ఆయన భ్రష్టుపట్టించిన తీరుపై పత్రికలు కథనాలు ప్రచురించాయన్న పల్లా శ్రీనివాసరావు..ఆ వివరాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. వర్సిటీకి సంబంధించిన కీలక దస్త్రాలను మాయం చేశారని, వీటన్నింటిపై పూర్తిస్థాయి విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అండర్ స్టాండింగ్!

... 5వ పేజీ తరువాయి

ఉన్నారు. వీరంతా ఉన్నప్పటికీ జోన్-3 పరిధిలోని 21వ వార్డు బీచ్‌రోడ్డులో పారిశుధ్య నిర్వహణకు 30 మంది కార్మికులను నెలరోజులపాటు నామినేషన్ పద్ధతిలో నియమించారని చెప్పి ఒక కాంట్రాక్టర్‌కు రూ.4.65 లక్షలు బిల్లు చెల్లించేందుకు ఎజెండాలో ప్రతిపాదించారు. అలాగే ప్రతి వార్డు సచివాలయానికి ఒక క్లాప్ వాహనం చెత్త తరలించేందుకు ఉండగా, చెట్ల వ్యర్థాలు, డెబ్రిస్ తరలించేందుకు జీవీఎంసీకి చెందిన వాహనాలు ప్రత్యేకంగా ఉన్నాయి. అయినప్పటికీ జోన్-2 పరిధిలోని ఐదు నుంచి 13వ వార్డు వరకూ చెట్ల వ్యర్థాలు తరలించేందుకు రెండు వాహనాలను నెల రోజులుపాటు పెట్టినందుకు కాంట్రాక్టర్‌కు రూ.4.48 లక్షలు చెల్లించాలంటూ ఎజెండాలో ప్రతిపాదించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అలాగే జోన్-2 పరిధి 5,6,7 వార్డుల్లో చెత్త సేకరించడానికి క్లాప్ వాహనాలకు అదనంగా మూడు టాటా ఏస్ వాహనాలను పెట్టిన కాంట్రాక్టర్‌కు రూ.4.86 లక్షలు చెల్లించాలని ఎజెండాలో చేర్చడం విశేషం. వీటన్నింటినీ స్టాండింగ్ కమిటీ సభ్యులు తిరస్కరించాలని భావించినప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్లకు ఫోన్ చేసి కొందరు సభ్యులు మాట్లాడగా పది శాతం కమీషన్ ఇచ్చేందుకు అంగీకరించడంతో వాటిని ఆమోదించాలని తీర్మానించుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. వీటితోపాటు జీవీఎంసీ పరిధిలో ఎక్కువ వెలుతురునిచ్చే సామర్థ్యం కలిగిన వీధి దీపాలు ఏర్పాటు, ప్రతి జోన్‌లో పాములు పట్టుకునేందుకు ఒక క్యాచర్‌ను రూ.పది వేల వేతనానికి నియమించుకోవడం, వీధికుక్కలను పట్టుకుని ఆపరేషన్లు చేసేందుకు వాహనాలను సమకూర్చుకోవడం, నగరంలో నిరాశ్రయుల షెల్టర్లలో పనిచేస్తున్న సిబ్బంది ఏడాదిపాటు పొడిగింపు, షెల్టర్‌లో ఉండేవారికి భోజనాలు సమకూర్చే అంశాలను ఎజెండాలో చేర్చారు. 70, 76, 96 వార్డుల్లో అభివృద్ధి పనులు, దుకాణాల వేలం వంటి అంశాలను ఎజెండాలో చేర్చారు.

తప్పుడు పత్రాలు సమర్పిస్తే కేసులు

... 5వ పేజీ తరువాయి

ఎవరో తెలుసుకుంటే చాలా వరకూ మోసపోకుండా ఉండడానికి అవకాశం ఉంటుంది.

ప్ర: ప్రజలకు స్టాంపు పేపర్లు అందుబాటులో తెచ్చారా?

జ: సుమారు రూ.12 కోట్ల విలువైన స్టాంపు పేపర్లు తొలి విడతలో తెప్పించాం. రూ.100 విలువైనవి 72 వేలు, రూ.50 విలువైనవి 80 వేలు, ఇంకా రూ.20, రూ.10 విలువ కలిగినవి కూడా తెప్పించాం. జిల్లాలోని తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోను అందుబాటులో ఉన్నాయి. స్టాంపు విక్రేతలకు కూడా ఇచ్చాం.

ప్ర: స్టాంపు పేపర్లను పాత తేదీలు వేసి విక్రయిస్తే ఏం చేస్తారు?

జ: గతంలో ఇలాంటివి జరిగేవి. ఇప్పుడు అవకాశం లేదు. దీనికి ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ తీసుకువచ్చారు. ఎవరికి స్టాంపు పేపర్ విక్రయించినా ఆన్‌లైన్‌లో పేరు, తేదీ నమోదు చేయాల్సిందే. కొన్నవారి మొబైల్ నంబరుకు ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేశాకే స్టాంపు పేపరు ఇవ్వాల్సి ఉంటుంది. ఎవరి దగ్గర ఎన్ని స్టాంపు పేపర్లు ఉన్నాయో కూడా లెక్క తెలిసిపోతుంది. స్టాకు ఉంచుకొని ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటాం. స్టాంపు విక్రేతలు ఇండెంట్ పెట్టాలన్నా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి.

ప్ర: ఈ స్టాంపింగ్ (జెరాక్స్) డాక్యుమెంట్‌కు స్వస్తి పలికినట్టేనా?

జ: కక్షిదారులు ఏది కోరుకుంటే దానిపైనే డాక్యుమెంట్ ఇస్తాం. ప్రభుత్వం నుంచి అయితే ఈ స్టాంపింగ్ ఆపేయాలని ఉత్తర్వులు రాలేదు. ఇప్పుడు అంతా రూ.100 స్టాంపు పేపర్లపైనే లావాదేవీలు రాసుకొని, వాటిపైనే డాక్యుమెంట్లు తీసుకుంటున్నారు.

డ్రై డే తప్పనిసరి : వైద్యులు

జగదాంబ కూడలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలు వారంలో ఒక రోజు తప్పనిసరిగా డ్రై డే పాటించాలని ప్రజారోగ్య విభాగం అధికారులు సూచించారు. గురువారం వారు పోర్టు అథారిటీ అధికారులతో కలిసి వన్‌టౌన్ పరిధిలోని కోటవీధి, అంబుసరంగ్ వీధి, ఫెర్రీ రోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు తరచూ జ్వరాల బారిన పడుతుండడంతో నీటి నిల్వలను పరీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్లల్లోనూ, పరిసరాల్లో నీటి నిల్వల వల్ల దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. డ్రమ్ములు, ట్యాంకులు, పూల కుండీల్లో నీటి నిల్వలు లేకుండా వారంలో ఒక రోజు డ్రై డే పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు విజయ్, పోర్టు అథారిటీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు జరిమానా

పూర్ణామార్కెట్,నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆటోలో పరిమితికి మించి స్కూల్ పిల్లలను ఎక్కించిన డ్రైవర్‌పై వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, పది వేల రూపాయల జరిమానా విధించారు. గురువారం పూర్ణామార్కెట్ దరి రాజారామ్మోహన్‌రాయ్ రోడ్డు నుంచి జగదాంబ వైపు వెళ్తున్న స్కూల్ ఆటోలో ఏకంగా 20 మంది పిల్లలు ఉన్నారు. ఈమేరకు వన్‌టౌన్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ విశ్వనాథ్ ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, జరిమానా విధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను, స్కూల్ పిల్లలను ఎక్కిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

2 నుంచి కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు

మహారాణిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో వచ్చే నెల 2 నుంచి 30 వరకు మార్గశిర మాసోత్సవాలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి

పూర్ణామార్కెట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హార్బర్ పోలీస్ స్టేషన్ ఏసీపీ ఎన్. కాళిదాసు చెప్పారు. గురువారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో యువతరం, మత్తు పదార్థాలు, వినియోగం అన్న అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితాలు నాశనం అవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ జీడిబాబు, తదితరులు పాల్గొన్నారు.



మెరైన్ మత్స్యకార మ్యూజియమ్‌లో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

పథకాలపై అవగాహన అవసరం

ప్రపంచ మత్స్యకారుల దినోత్సవంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన అవసరమని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా భారతీయ మత్స్య పరిశోధనా సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సముద్రం జలాలు కలుషితం కాకుండా చూడడంతో పాటు మత్స్య సంపద పరిరక్షణ మత్స్యకారుల బాధ్యత అని చెప్పారు. జిల్లాలో 32 తీర గ్రామాలు ఉండగా 15 ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. సుమారు రూ. 178 కోట్లతో ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయన్నారు. బోట్ల ఫిట్‌నెస్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని, పనికిరాని వలలను, వ్యర్థాలను సముద్రంలో వేయకూడదని సూచించారు. అంతకముందు ఆయన మెరైన్ మ్యూజియంను సందర్శించారు.ఈ కార్యక్రమంలో మెరైన్ ఎస్పీ రవివర్మ, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి. లక్ష్మణరావు, డి. బామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో...

మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం రాయితీలు కల్పించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి కోరారు. గురువారం బీచ్‌రోడ్డులో విశాఖ మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు అల్లిపల్లి ఎల్లజీ ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్యకారులను ఆర్థికంగా ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. అలాగే సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. అనంతరం అన్న దానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు జింతపల్లి పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని వైద్య సిబ్బంది

జోనల్ కమిషనర్ ఆగ్రహం



హాజరుపట్టిక పరిశీలిస్తున్న జడ్సీ రాము

జ్ఞానాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9 గంటలకు ఓపీ ప్రారంభం కావాల్సి ఉండగా 10 గంటలకు కేవలం స్టాఫ్ నర్సు, డేటా ఎంట్రీ ఆపరేటర్ తప్ప మిగతా సిబ్బంది రాకపోవడంతో రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ఈ కేంద్రంలో మొత్తం ఏడుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఎక్కువగా వృద్ధులు, మహిళలు వస్తుంటారు. వారు షుగర్ పరీక్ష చేయించుకోవాలంటే ఎటువంటి ఆహారం తీసుకోకూడదు. దీంతో సిబ్బంది ఆలస్యంగా రావడంతో వారంతా అవస్థలు పడుతున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు మెడికల్ ఆఫీసర్, ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్సు కేంద్రంలో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలి. కానీ ఎవరూ పూర్తి సమయం ఉండడం లేదు. ఈవిషయమై స్థానికులు జోన్-5 జడ్సీ బి. రాముకు ఫిర్యాదు చేయడంతో ఆయన గురువారం ఉదయం కేంద్రాన్ని తనిఖీలు చేశారు. ఉదయం 9.30 గంటలకు ఇద్దరే ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది తీరు గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. హాజరుపట్టికను పరిశీలించి, సమయపాలన పాటించాలని లేకపోతే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. మరోసారి రోగుల నుంచి ఎటువంటి ఫిర్యాదు రాకుండా చూసుకోవాలని సూచించారు.

సామాజిక సేవే లక్ష్యం

డాబాగార్డెన్స్ నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చివరి శ్వాస వరకు సామాజిక సేవే తన లక్ష్యమని ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది బైపా అరుణ్‌కుమార్ అన్నారు. గురువారం డాబాగార్డెన్స్ బీవీకే ఛాంబర్స్‌లో అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో అరుణ్‌కుమార్‌కు ఆంధ్రరత్న పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన తన జీవితాంతం సమాజానికి సేవలందిస్తానన్నారు. సమాఖ్య కన్వీనర్ డా. గణగళ్ల విజయకుమార్ మాట్లాడుతూ 1969 నుంచి ఇప్పటివరకు పలు సామాజిక సేవా రంగాల్లోనూ, న్యాయవాద వృత్తి ద్వారా అరుణ్‌కుమార్ పేదలకు సేవలందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

'ఆకాశం నీ హద్దురా' పోస్టర్ ఆవిష్కరణ

డాబాగార్డెన్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విభిన్న హావభావాలను తన నటనతో పలకించే గొప్ప నటుడు కమల్‌హాసన్ అని మాజీ ఏడీసీపీ మహమ్మద్‌ఖాన్ అన్నారు. గురువారం డాబా గార్డెన్స్‌లో గీత్ సంగీత్ ఆధ్వర్యంలో 'ఆకాశం నీ హద్దురా' కమలహాసన్ ప్రత్యేక సినీ సంగీత విభావరి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 23న గీత్ సంగీత్ సంస్థ ఆధ్వర్యంలో కమల్‌హాసన్ నటించిన చిత్ర గీతాలతో ప్రత్యేక సంగీత విభావరి విశాఖ పౌర గ్రంథాలయంలో జరగనుందన్నారు. సంగీత ప్రియులు, కమల్‌హాసన్ అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మనోహర్, కోరుకొండ రంగారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తికి పదేళ్లు జైలు

డాబాగార్డెన్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గంజాయి కలిగిఉన్న వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ నగరంలోని ఒకటవ ప్రధాన మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం. వెంకటరమణ గురువారం తీర్పునిచ్చారు. జైలు శిక్షతో పాటు లక్ష రూపాయలు జరిమానా చెల్లించాలని లేనిపక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రసాదరావు తెలిపిన వివరాలు ప్రకారం.. ఒడిశాలోని కోరాపుట్ జిల్లాకు చెందిన హర్షిత్‌ఖాన్ అనకాపల్లి జిల్లా కొత్తూరు సమీపంలో రోడ్డు పక్కన 20 కిలోలు గంజాయితో 2021 ఆగస్టు 19న కొత్తూరు పోలీసులకు పట్టుబడ్డాడు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి అతనికి పదేళ్లు జైలు శిక్షతో పాటు రూ. లక్ష జరిమానా విధించారు.

తల్లి చెంతకు బాలుడు

జగదాంబ కూడలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తప్పిపోయిన ఏడేళ్ల బాలుడ్ని పోలీసులు కొన్నిగంటల వ్యవధిలో తల్లి చెంతకు చేర్చారు. మహారాణిపేట సీఐ భాస్కర్ తెలిపిన వివరాలు ప్రకారం.. వన్‌టౌన్ ఏరియాకు చెందిన ఏడేళ్ల బాలుడు బుధవారం మధ్యాహ్నం తప్పిపోవడంతో తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈమేరకు గురువారం ఉదయం ఆ బాలుడు టూ టౌన్ పరిధిలో కనిపించడంతో పోలీసులు బాలుడ్ని తీసుకువచ్చి తల్లికి అప్పగించారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ ఓవరాల్ చాంప్ విశాఖ



విజేత విశాఖ జట్టుకు బహుమతి ప్రదానం

మచిలీపట్నం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కృష్ణా జిల్లాకేంద్రం మచిలీపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి 38వ బాక్సింగ్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఇందులో విశాఖ క్రీడాకారులు మూడు కేటగిరీల్లోనూ ఉత్తమ ప్రతిభ చాటారు. అండర్ 14, అండర్ 17 బాలురు విన్నర్స్‌గా నిలవగా, అండర్ 17 బాలికలు ప్రథమస్థానం సాధించారు. విజేతలకు మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి బహుమతులు అందించారు.

పూర్తయిన నిర్మాణం.. ప్రారంభానికి తాత్సారం

- ఆరేళ్ల క్రితం పూర్తయినా.. అందుబాటులోకి రాని మార్కెట్ యార్డు
- ఏర్పాట్లు పూర్తయినా ప్రారంభం కాని రైతుబజార్
- ప్రజా ప్రతినిధులు పట్టించుకోరు
- అధికారులు నిర్లక్ష్యం వీడరు
- రూ.లక్షల ప్రజాధనం వృథా



ఆరేళ్ల నుంచి ప్రారంభానికి నోచుకోని మార్కెట్ యార్డు





ఊడుతున్న పెచ్చులు.. దట్టంగా పెరిగిన తుప్పలు

ఆరిలోవ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో ఏర్పాటు చేసిన మార్కెట్ యార్డు ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో దీని నిర్మాణం వెనుక ఉద్దేశం నెరవేరక పోవడంతో పాటు రూ.లక్షల ప్రజాధనం వృథా అవుతోంది. సుమారు ఐదేళ్ల కిందట నిర్మించిన ఈ మార్కెట్ యార్డును ప్రారంభించాలన్న స్పృహ ప్రజా ప్రతినిధులు గాని, అధికారులకు గాని లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ ప్రాంతంలో వీరబ్రహ్మేంద్ర ఆలయానికి ఎదురుగా సుమారు రూ.55 లక్షలతో 2018లో మార్కెట్ నిర్మాణం చేపట్టారు. దీని నిర్మాణం 2019, ఫిబ్రవరిలో పూర్తయింది. వ్యాపార అవసరాల కోసం మొత్తం 50 షాపులను కూడా షెడ్లు రూపంలో నిర్మించారు. వీటిని పేదలకు కేటాయించడం ద్వారా వారికి ఆర్థికంగా ఆసరా ఇవ్వవచ్చనేది ఆలోచన. నిర్మాణం పూర్తయిన అనంతరం ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. అయితే ఆ ఏడాది ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభానికి నోచుకోలేదు. అప్పటి నుంచి ఈ యార్డుకు గ్రహణం పట్టినట్టు అయింది. దీన్ని ప్రారంభించేందుకు అధికారులు ప్రయత్నాలు చేయనేలేదు.

ఈ మార్కెట్ యార్డు నిర్మాణం పూర్తయి సుమారు ఆరేళ్లు కావస్తుండడం, వినియోగంలో లేకపోవడంతో పలు చోట్ల పాడైంది. అంతేకాకుండా నిరుపయోగంగా ఉండడంతో దట్టంగా తుప్పలు పెరిగిపోయాయి. దీంతో కొందరు ఆకతాయిలు చేరి గంజాయి తాగడం, పేకాట ఆడడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.

ఈ యార్డులో చిరు వ్యాపారాలు చేసేందుకు అనువుగా పెద్ద షెడ్లు నిర్మించి స్టాళ్ల ఏర్పాటు చేశారు. దీంతో యార్డు ప్రారంభమైతే కొందరికి ఉపాధి లభించే అవకాశం కూడా ఉంది. దీన్ని ప్రారంభిస్తే చిరు వ్యాపారాలు నిర్వహించేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు.

వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ మార్కెట్ యార్డు ప్రారంభోత్సవానికి ప్రజాప్రతినిధులు, అధికారులకు తీరికే లేకుండా పోయిందని స్థానికులు ఎద్దేవా చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలోనైనా దీని ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అయితే కొన్నిచోట్ల మరమ్మతులకు గురవడంతో బాగు చేయించి ప్రారంభించాల్సి ఉంటుంది. ఇలాగే వదిలివేస్తే పూర్తిగా పాడయ్యే ప్రమాదం ఉందని పలువురు అంటున్నారు.



తోటగరువులో ఏర్పాటు చేసి ప్రారంభించని రైతుబజార్

అందని ద్రాక్షలా రైతు బజార్..

కాగా, మార్కెట్ యార్డు నిధులతో తోటగరువు హైస్కూలుకు సమీపంలో గెడ్డకు ఆనుకొని సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ భూమిలో రూ.80 లక్షలతో ఆరిలోవలో రైతు బజారును ఏర్పాటు చేశారు. అయితే ఈ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు నిధులు మంజూరు చేయలేదు. దీంతో సదరు కాంట్రాక్టర్ రైతుబజార్‌ను మార్కెట్ యార్డును అప్పగించలేదు. దీనిపై ఎలాంటి పరిష్కారం గాని, చర్యలు తీసుకోవడంపై అధికారులు దృష్టి సారించలేదు. కానీ ఇంతవరకు ఆచరణ కాలేదు. ఈ రైతుబజార్‌లో 36 స్టాళ్లు నిర్మించారు. మూడు హోల్‌సేల్ కిరాణా షాపులు, కోల్డ్ స్టోరేజ్, కార్యాలయం భవనం, వెయిటింగ్ రూం నిర్మించారు. రైతుబజార్ ప్రారంభానికి నోచుకోకపోవడంతో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి అపరిశుభ్రం నెలకొంది.

కొన్ని నెలల కిందట విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఈ రైతుబజార్‌ను పరిశీలించి, ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మార్కెట్ యార్డు, రైతు బజార్ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు, చిరు వర్తకులు కోరుతున్నారు.

చిరు వ్యాపారాలకు అవకాశం కల్పించండి

సీఐటీయూ ఆధ్వర్యంలో 22వ వార్డు వ్యాపారుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న చిరు వర్తకులు, సీఐటీయూ నేత వెంకటరావు తదితరులు

మద్దిలపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డులో తొలగించిన చిరు వ్యాపారాలను యథావిధిగా నిర్వహించుకునేలా అనుమతులు ఇవ్వాలని సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వెంకటరావు కోరారు. చిరు వర్తకులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో వీధి వ్యాపారులు గురువారం మద్దిలపాలెం కళాభారతి నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అన్యాయంగా దుకాణాలు తొలగించారని ఆరోపించారు. ఎక్కడైనా అధికారులు చిరు వ్యాపారాలను తొలిగిస్తే.. ప్రజాప్రతినిధులు అడ్డుకొంటారని, ఇక్కడ ప్రజాప్రతినిధే దుకాణాలు తొలిగించాలంటూ హైకోర్టు వరకు వెళ్లడం దుర్మార్గమన్నారు. ఓట్లేసి గెలిపించిన ప్రజలకు రోడ్డున పడేయడం సబబు కాదన్నారు. కార్పొరేటర్ మూర్తి యాదవ్ నిర్వాకం వల్ల ఉపాధి కోల్పోయిన వారికి వ్యాపారాలు చేసుకోవడానికి అనుమతులివ్వాలని కోరారు. సుప్రీంకోర్టే నగరాల్లో వారంతపు సంతల నిర్వహణకు ఆదేశాలిచ్చిందన్నారు. నగరంలో అన్నీ ప్రాంతాల్లో వారాంతపు సంత నిర్వహిస్తున్నారన్నారు. కళాభారతి రోడ్డులో మాత్రం సంత పెట్టకుండా కార్పొరేటర్ మూర్తియాదవ్ అడ్డుకోవడం సరికాదన్నారు. రోడ్డు ఆక్రమణలు తొలగించాలని హైకోర్టు ఆదేశాలిచ్చేందే కాని సంత వద్దని చెప్పలేదన్నారు. అందుకే పిఠాపురంకాలనీలో సంత ఏర్పాటుకు జీవీఎంసీ అధికారులు అనుమతులు ఇవ్వాలని కోరారు.

ఏయూ ఐఏఎస్ఈలో ఫిలాసఫీ డే



వివేకానందుడికి నివాళి అర్పిస్తున్న నాగరాజకుమారి

వెంకోజీపాలెం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : ఏయూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్ (ఐఏఎస్ఈ) ప్రాంగణంలో గురువారం వరల్డ్ ఫిలాసఫీ డేని పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగరాజకుమారి ప్రసంగిస్తూ ఆధ్యాత్మిక జీవన విధానమే ఉన్నతమైనదన్నారు. ముఖ్య అతిథి, విశ్రాంత ఆచార్యులు మదన మోహన్ మాట్లాడుతూ రవీంద్రనాథ్ ఠాగూర్, అరవిందో, వివేకానందల యొక్క ఆధునిక తత్వం గొప్పతనాన్ని, వారు చెప్పిన ఉన్నత విలువల్ని గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ తిరుమలాంబ, సహ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

సమస్యల పరిష్కారం కోసం విశాఖ డెయిరీ కార్మికుల దీక్షలు



నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేతన సవరణతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విశాఖ డెయిరీ కార్మికులు సంస్థ మెయిన్ గేటు వద్ద గురువారం రిలే నిరాహార దీక్షలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా విశాఖ డెయిరీ కో-ఆపరేటివ్ ఎంప్లాయిస్‌యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.రమణ మాట్లాడుతూ గత 24 ఏళ్లుగా కార్మికులకు కనీస వేతనాలతో పాటు ఎటువంటి కనీస హక్కులు కల్పించకుండా డెయిరీ యాజమాన్యం కార్మికుల శ్రమను దోచుకోవడం దారుణమన్నారు. ఈ నెల ఒకటిన తమ తమ డిమాండ్లను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లితే ఏ ఒక్కదానికి అంగీకారం తెలపకపోవడంతో తాము రిలే నిరాహార దీక్షలకు దిగామన్నారు. యూనియన్ అధ్యక్షుడు కె.వరహామూర్తి మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను డెయిరీ యాజమాన్యం త్వరగా పరిష్కరించకపోతే డిసెంబరు ఐదో తేదీ తర్వాత డెయిరీలోని అన్ని విభాగాల కార్మికులు విధులు బహిష్కరించి ఆందోళనకు దిగుతారని హెచ్చరించారు. దీక్షల్లో యూనియన్ నాయకులు ఈశ్వరరావు, భాస్కరరావు, నాగ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు. కాగా డెయిరీ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు సీఐటీయూ బెల్ హెచ్‌పీవీపీ నాయకులు జీటీపీ ప్రకాశ్, సనపల జగన్నాథరావు, అప్పారావు, తదితరులు సంఘీభావం తెలిపారు.

ఆచార్య బీఆర్ రావుకు ఘన నివాళి



ఆచార్య బీఆర్ రావుకు నివాళి అర్పిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు, ఆచార్యులు

వెంకోజీపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో బీఆర్ రావు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిజిక్స్ విభాగం వద్ద ఉన్న బీఆర్ రావు విగ్రహానికి ఏయూ వీసీ జి.శశిభూషణరావు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ రావు అనేక సంవత్సరాలు శాస్త్రీయ పరిశోధన, విద్యా రంగంలో అందించిన అద్భుతమైన సేవల వల్ల ప్రపంచం ఇప్పటికీ ఆయనను గుర్తుంచుకుందన్నారు. ఏయూలో స్పేస్ ఫిజిక్స్ ల్యాబరేటరీ ఏర్పాటు చేయడంలో రావు కృషి అభినందనీయమన్నారు. యూజీసీ వైస్ చైర్మన్‌గా, రాజ్యసభ సభ్యుడిగా, భట్నాగర్ అవార్డు గ్రహీతగా ఏయూకు జాతీయస్థాయిలో విశేష గుర్తింపును తీసుకొచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

అందరూ చూడదగ్గ సినిమా 'మెగాస్టార్ ఫ్యాన్'



మీడియాతో మాట్లాడుతున్న చిత్ర యూనిట్

పెదవాల్తేరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అందరూ చూడదగ్గ సినిమా 'మెగాస్టార్ ఫ్యాన్' అని ఆ చిత్ర డైరెక్టర్ కిరణ్ వారియర్ అన్నారు. అల్లు ప్రొడక్షన్ బ్యానర్‌పై కిరణ్ వారియర్ దర్శకత్వంలో లుక్స్ రాజ్ హీరోగా, సై ఫేమ్ సూర్య ప్రధాన పాత్రలో ఈ చిత్రం నిర్మితమైంది. ఈ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా గురువారం స్థానిక అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కిరణ్ వారియర్ మాట్లాడుతూ ఈ సినిమా 29న విడుదల చేస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో యువ హీరో కంచర్ల ఉపేంద్ర, హీరో లుక్స్ రాజ్, నటుడు సూర్య, రెండో హీరోయిన్లు సోనిరెడ్డి, భువన సీత, ఎడిటర్ శ్యామ్ కుమార్, నటుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.


ఉత్సాహంగా రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలు



విజేతలతో సింహాద్రి హెచ్‌వోపీ సమీర్‌శర్మ, తదితరులు

పరవాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో గురువారం రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలు జరిగాయి. 'ఎనర్జీ కన్జర్వేషన్ టు ప్రొటెక్ట్ ద ఎన్విరాన్‌మెంట్' అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఏ-గ్రూప్ నుంచి వి.రౌనక్‌కుమార్ (ప్రెసిడెన్షియల్ స్కూల్, సీతమ్మధార), బోడా సూర్య వెంకటచరణ్ (శ్రీ సత్యసాయి గురుకులం, రాజమండ్రి),బి.జసీర్ ప్రణీత (టింపనీ సీనియర్ సెకెండరీ స్కూల్, విశాఖపట్నం), బి- గ్రూప్ నుంచి తాన్యాగోసోమి (బాలభారతి పబ్లిక్ స్కూల్, సింహాద్రి), సీహెచ్ భావజ్ఞ (శ్రీప్రకాష్ విద్యానికేతన్), ధనలక్ష్మి (డీఏవీ పబ్లిక్ స్కూల్, ఉక్కునగరం) విజేతలుగా నిలిచారు. ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ రూ.30వేలు, తృతీయ రూ.20వేలు, కన్సొలేషన్ బహుమతి రూ.7,500 చొప్పున ప్రకటించారు. కార్యక్రమంలో సింహాద్రి జీఎంలు గడ్డంనోవా, రష్మీరంజన్ పరిడా, ప్రశాంత్‌కుమార్‌జీనా, హెచ్‌ఆర్ హెడ్ బీబీ పాత్ర, సీఎస్ఆర్ అధికారి కె.ప్రకాశరావు పాల్గొన్నారు.

హెచ్ఆర్ విద్యార్థులకు అపార అవకాశాలు



మల్లాది శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న ఆచార్యులు కోటిరెడ్డి, రవి తదితరులు

వెంకోజీపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో ఉద్యోగ జీవిత ఇతివృత్తంపై గెస్ట్ లెక్చర్ ఉపన్యాసాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా హైదరాబాద్ డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ కార్పొరేట్ అఫైర్స్ అండ్ హ్యూమన్ రిలేషన్స్ అఫైర్స్ అసోసియేట్ డైరెక్టర్ మల్లాది శ్రీకాంత్ హాజరై హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు విస్తృత ఉపాధి అవకాశాలు ఉంటాయని, ఆ అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే ఎవరికివారు ప్రశ్నించుకొని సిద్ధం కావాలన్నారు. డిపార్టుమెంట్ ఆఫ్ ఇన్వెస్టుమెంటేషన్‌విభాగాధిపతి కోటిరెడ్డి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ జాలాది రవి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు మెరుగైన విద్య, వైద్యం అందించాలి



మాట్లాడుతున్న రమేశ్

రామ్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకార సామాజిక వర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే వారికి మెరుగైన విద్య, వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని జనసేన పార్టీ మత్స్యకార నాయకుడు చీకటి రమేష్ అన్నారు. గురువారం మత్స్యకార దినోత్సవం సందర్భంగా మత్స్యకారుల అభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు ఐకమత్యంతో ముందుకు వెళ్లటం ద్వారా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మత్స్యకార నాయకులు, పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.

జీవీఎంసీ పీజీఆర్ఎస్ నమోదు కౌంటర్లు పరిశీలన

వెంకోజీపాలెం,నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీకి ప్రతి సోమవారం నమోదవుతున్న ప్రజా వినతులు, ఫిర్యాదులను పూర్తి వివరాలతో క్లుప్తంగా నమోదు చేయాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి అన్నారు. గురువారం ఆయన అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణతో కలిసి జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల పీజీఆర్ఎస్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు.

నమోదవుతున్న ఫిర్యాదులను అన్ని విభాగాలకు సంబంధించిన అధికారులు, ఉద్యోగులు తెలుసుకుని పరిష్కరించేందుకు వీలుగా ఒక ప్రత్యేకమైన వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

సంక్షిప్తంగా..

కృష్ణా కళాశాలలో రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు, పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపకులు

మద్దిలపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) :డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్, లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ బి.సుజాత ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యువత సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు దుర్గాప్రసాద్, చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ అధికారి బి.సన్యాసిరావు, అధ్యాపకులు బాలమురళీ, కృష్ణారావు, ఆర్వీ నాయుడు, వేదవ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : హనుమంతవాక ఫీడర్ మరమ్మతులు చేపడుతుండడంతో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ (ఆపరేషన్స్) పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. చినగదిలి, పెదగదిలి, దీన్‌దయాళ్‌పురం, కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయం, ఎస్సీ కాలనీ, శాలిపేట తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోదారులు సహకరించాలని కోరారు.

క్లాత్ బ్యాగుల పంపిణీ

వెంకోజీపాలెం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) :స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఎంఎంటీసీ కాలనీలోని త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు వెంకన్న ప్రతిమలతో కూడిన గుడ్డ సంచులను ఆలయ కార్యదర్శి ఎం.సావిత్రి, కోశాధికారి కె.సుబ్బారాయుడు ఆధ్వర్యంలో భక్తులకు క్లాత్ సంచులు పంపిణీ చేపట్టారు. గురువారం ఆలయానికి విచ్చేసిన భక్తులకు సుమారు 100 మందికి ఈ సంచులను అందజేశారు. కార్యక్రమంలో మేనేజరు బి.సన్యాసిరావు, ఆలయ అర్చకులు వెంకటరమణాచార్యులు, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వస్త్రదానం



వస్త్రదానం చేస్తున్న సత్యసాయి భక్తులు

ఆరిలోవ, నవంబరు 21 : (ఆంధ్రజ్యోతి) ఆరిలోవ అంబేడ్కర్ జంక్షన్‌లోని బీటీఆర్ నగర్‌లోని సత్యసాయిమందిరంలో ఈ నెల 21 నుంచి 23 వరకు భగవాన్ సత్యసాయిబాబా జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్నారు.ఈసందర్భంగా పేదలకు వస్త్ర, అన్నదానం చేశారు.

సినిమా గైడ్

- **మెకానిక్ రాఖీ:** మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- **దేవకీనందన వాసుదేవ:** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **జీబ్రా:** శారద, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)
- **కంగువా:** సంగం, రమాదేవి, శ్రీరామ, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **లక్కీ భాస్కర్:** వెంకటేశ్వర
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 36, వంకాయలు (తెలుపు)32, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 24, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 40, బీరకాయలు 34, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 34, క్యారెట్ 70 దొండకాయలు 34, బంగాళ దుంపలు 40, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)50, బరబాటి 30, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 36, దోస కాయలు 25, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 55, పొటల్స్ 44, కీర దోస 22, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడ దుంపలు 32, కంద 66, దేముడు చిక్కుడు 75, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
ఫారం ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230



వీసీ శశిభూషణరావును కలిసిన వీసీటీపీఎల్ జీఎం ఎంఎన్ రావు

ఏయూలో మొక్కల పెంపకానికి వీసీటీపీఎల్ సుముఖం

వెంకోజీపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో విస్తృత స్థాయిలో మొక్కలు పెంచేందుకు విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేటు లిమిటెడ్ (వీసీటీపీఎల్) ముందుకు వచ్చింది. గురువారం ఏయూ వీసీ జి.శశిభూషణరావుతో వీసీటీపీఎల్ సీనియర్ జీఎం ఎంఎన్ రావు, ఏఎం ధనుంజయ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీరు ఏయూలో ఒక ప్రత్యేకమైన స్థలంలో విస్తృత స్థాయిలో మొక్కల నాటుతామని వెల్లడించారు. మొక్కలు నాటడానికి అవసరమైన స్థలాన్ని గుర్తించి ఏయూ అధికారులు తమకు అప్పగిస్తే అవసరమైన మొక్కలను నాటి, పెంచే కార్యక్రమాన్ని సైతం చేపడతామన్నారు. ఈ సందర్భంగా ఏయూకు సహకారం అందించేందుకు ముందుకు వచ్చిన వీసీటీపీఎల్ అధికారులకు ఈ ప్రతిపాదనను పంపిన టెర్మినల్ హెడ్ కెప్టెన్ సుదీప్ బెనర్జీలకు వీసీ కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో ఇందుకు సంబంధించిన పనులను ప్రారంభిద్దామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏయూ వృక్షశాస్త్రం విభాగాచార్యులు, హార్టికల్చరల్ విభాగం డీన్ ఎస్బీ పడాల్, డాక్టర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బీవీ రామారావు సేవలు చిరస్మరణీయం



రామారావుకు నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు తదితరులు

సిరిపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దివంగత బీవీ రామారావు సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు.గురువారం పారిశ్రామికవేత్త బీవీ రామారావు సంస్మరణ సభను ఆయన నివాస ప్రాంగణంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య హాజరై చిత్ర పటానికి నివాళులర్పించారు.పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా అనేక మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా రామారావు ఉపాధి కల్పించారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో బీవీ రామారావు సతీమణి బులుసు సతీసావిత్రి, కుమారుడు బులుసు వెంకటరామ్, రాధిక, ధన్వి, రామినేని వసంతలక్ష్మి తదితరులు నివాళులర్పించారు.

నేటి నుంచి సోలార్ ఎక్స్‌పో



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మద్దిలపాలెం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): దేశంలో సౌరవిద్యుత్ ఉత్పత్తి శాతం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గత ఏడాది సోలార్ విద్యుత్ ను 5.5 శాతం ఉత్పత్తి చేసి ప్రపంచంలోనే మూడో అతిపెద్ద సౌరవిద్యుత్ జనరేటర్‌గా అవతరించింది. ఇందులో భాగంగా పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం అమలుచేస్తోందని ఏపీ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు హేమకుమార్ చెప్పారు. ఈ మేరకు ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ సౌరవిద్యుత్ వినియోగానికి కేంద్రం చేపడుతున్న చర్యలు, అమలుచేస్తున్న పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి వీలుగా ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో రీనెక్స్ పేరుతో సోలార్ రెన్యూవబుల్ ఎనర్జీ ఎక్స్‌పో-24ను ఈనెల 22 నుంచి 24 వరకు నిర్వహిస్తున్నామన్నారు. నెలకు 150 లోపు యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వారు 1.2 కిలోవాట్ల రూఫ్‌టాప్, 150 నుంచి 300 యూనిట్ల వినియోగానికి 2 నుంచి 3 కిలోవాట్ల సామర్థ్యం గల రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కేంద్రం కిలోవాట్ రూఫ్‌టాప్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60వేలు, ఆపై రూ.78 వేలు సబ్సిడీ ఇస్తుందన్నారు. రుణాలిచ్చే బ్యాంకులు కూడా స్టాల్స్ ఏర్పాటు చేస్తాయన్నారు. ప్రదర్శనలో నగరవాసులు పాల్గొని పూర్తి సమాచారం తెలుసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామమోహనరావు, ఉపాధ్యక్షుడు నాగరాజు, కోశాధికారి జయబాబు, తదితరులు పాల్గొన్నారు.

మహా సభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నేతలు

ఆరిలోవ, నవంబరు 21 : (ఆంధ్రజ్యోతి) : అఖిల పక్ష కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, రైతు కిసాన్ మోర్చా ఆధ్వరంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఈ నెల 26న నిర్వహించనున్న మహా సభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ఆరిలోవ నేతలు కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను హనుమంతవాక జంక్షనులో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆరిలోవ ఏరియా సీపీఐ కార్యదర్శి కె.లక్ష్మణరావు, ఆటో యూనియన్ జిల్లా నాయకులు ఎస్.సూరిబాబు, జీఎస్ రాజేశ్, సుధ, జీకే రెడ్డి, గంగ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు నిరుద్యోగ జేఏసీ ధన్యవాదాలు

అక్కయ్యపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే 20 లక్షల ఉద్యోగాల హామీ అమలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు కు ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. నిప్పాన్ స్టీల్‌ప్లాంట్ ద్వారా 21 వేల ఉద్యోగాలు, ఎల్జీ ద్వారా 1495 ఉద్యోగాలు, డిఫెన్స్ మ్యాను ఫ్యాక్చరింగ్ కల్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్ ద్వారా 566, ఫిలిప్స్ కార్బన్ ద్వారా 200, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ ద్వారా 2381 ఉద్యోగాలను రాష్ట్రంలో యువతకు అందేందుకు ప్రయత్నాలు చేయడం హర్షణీయమన్నారు. యువత అభివృద్ధి దేశానికి వెన్నుముక అన్నారు. వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించడం, యువతకు ఉపాధిపై దృష్టి పెట్టకపోవడం వల్లే ప్రజల విశ్వాసం పొందలేకపోయిందన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. దాలిరాజు సూపర్ మార్కెట్, జగ్గారావు బ్రిడ్జి, యలమంచిలివారి వీధి, శివరామరెడ్డి స్వీట్స్ షాప్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

పోర్టు అథారిటీ మాజీ క్రీడాధికారి షేక్ సులేమాన్ మృతి



విశాఖపట్నం, స్పోర్ట్సు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం పోర్టు అథారిటీ మాజీ క్రీడాధికారి షేక్ సులేమాన్ (85) గురువారం గుండెపోటుతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. స్పోర్ట్సు ఇన్‌స్పెక్టర్‌గా 1969లో పోర్టులో ఉద్యోగంలో చేరిన ఆయన 1981లో క్రీడాధికారిగా పదోన్నతి పొందారు. ఆయన పదవీకాలంలో బాస్కెట్ బాల్ కోర్టు, అథ్లెటిక్స్ ట్రాక్, బ్యాడ్మింటన్ ఇండోర్ కోర్టులు, జిమ్నాజియం వంటి క్రీడా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడంలో కృషి చేయడమే కాకుండా వందలాది మంది క్రీడాకారులకు స్పోర్ట్సు కోటాలో ఉద్యోగాలు కల్పించారు. 1997, జూన్ 30న లో పదవీ విరమణ పొందిన ఆయన పోర్టు అథారిటీలో కన్నా ముందు నగరంలోని 104 ఏరియాలోని కేంద్రీయ విద్యాలయంలో పీఈటీగా పనిచేశారు. అథ్లెటిక్స్ కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో నిపుణుడిగా పేరొందారు. క్రీడాకారునిగా 1963-64లో ఆంధ్ర విశ్వవిద్యాలయం అథ్లెటిక్స్, కబడ్డీ జట్లకు ప్రాతినిధ్యం వహించారు. అలాగే జాతీయ వాలీబాల్, కబడ్డీ టోర్నీలలో పాల్గొన్న రాష్ట్ర జట్లకు అనేకసార్లు మేనేజర్‌గా వ్యవహరించారు. షేక్ సులేమాన్ భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కులగణనతోనే సామాజిక న్యాయం

» దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రభాకర్ తదితరులు

సీతంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దేశంలో కులగణనతోనే సామాజిక న్యాయం సాధ్యమని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ స్పష్టం చేశారు. రామాటాకీస్ రోడ్డులో గల అంబేడ్కర్ భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుల గణనన అంశంపై మేధావులతో ఈ నెల 23న అంబేడ్కర్ భవన్‌లో ఉదయం 10 గంటలకు సమావేశాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. రిజర్వేషన్లు కేవలం ప్రభుత్వ రంగానికి పరిమితం చేయడం న్యాయం కాదని, ప్రైవేటు రంగానికి వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గుబ్బల రాంబాబు, కోలా హరిబాబు, సరస్వతి, గొడుగు రాజు, బత్తుల గౌతంబాబు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలతో జ్ఞానసముపార్జన

» మాగ్నా ఇంటర్నేషనల్ సీఈవో డైరెక్టర్ సీతారామస్వామి



విద్యార్థులతో ముచ్చటిస్తున్న సీతారామస్వామి

సీతంపేట, నవంబరు 21 : యువత మంచి పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మాగ్నా ఇంటర్నేషనల్ సీఈవో డైరెక్టర్ సీతారామస్వామి కోటగిరి పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో గ్రంథాలయ సొసైటీ, సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ నిర్వహణలో 'కమింగ్ టుగెదర్ ఫర్ డెసిమినేషన్ ఆఫ్ నాలెడ్జ్' అంశంపై ప్రసంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాగ్నా ఇంటర్నేషనల్ సీఈవో సీతారామస్వామి మాట్లాడుతూ..తాను కర్ణాటకలో బిట్స్ పిలానిలో చదువుకొని మెకానికల్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రుడై అమెరికాలో చిన్న చిన్న ఉద్యోగాలు చేశానన్నారు. కష్టపడి సంపాదించుకోవడానికి ఎవరూ సంకోచించనక్కరలేదన్నారు. అమెరికాలో వివిధ కంపెనీల్లో పనిచేసి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని స్వయం కృషితో ఎదిగానని తెలిపారు. జనరల్ మోటార్స్‌లో ఉన్నత పదవిలో పని చేసి లక్ష మందికిపైగా ఉద్యోగులతో ప్రపంచంలో మూడో పెద్ద ఆటోమొబైల్ కంపెనీ సీఈవో స్థాయికి ఎదిగానన్నారు. కఠోర శ్రమ, లక్ష్య సాధన దీక్ష, వృతిపట్ల అకింత భావం ఉండాలని తెలిపారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఆత్మ విశ్వాసమే మనల్ని గెలిపిస్తుందని, ఫలితం ఆశించకుండా మంచి కోసం పని చేయాలని సందేశమిచ్చారు. అంతకుముందు ఆయన విశాఖ పౌర గ్రంథాలయాన్ని వీక్షించారు. సొసైటీ కార్యదర్శి డీఎస్ వర్మ గ్రంథాలయం అందిస్తున్న సేవలు, పాఠకులకు అందుబాటులో ఉంచిన సదుపాయాలు, పుస్తకాలు, నిర్వహిస్తున్న కార్యక్రమాలను సీతారామస్వామికి వివరించారు. విద్యార్థులతో సీతారామ స్వామి ముచ్చటించారు. గ్రంథాలయ సొసైటీ ఉపాధ్యక్షులు టీఎస్ఆర్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఆచార్య ఎ.ప్రసన్న కుమార్, ప్రధాన కార్యదర్శి డీఎస్ వర్మ, కార్యదర్శి డాక్టర్ డీవీ సూర్యారావు, గ్రంథపాలకులు దుర్గారాణి, గ్రంథాలయ సిబ్బంది. విద్యార్థులు పాల్గొన్నారు.

ద్వారకా క్రైమ్ పోలీసు స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ లతామాధురి



సిబ్బందికి సూచనలు అందిస్తున్న డీసీపీ (క్రైమ్స్) లతామాధురి

సీతంపేట, నవంబరు 21 : ద్వారకా పోలీసు స్టేషన్‌లో క్రైమ్ విభాగాన్ని డీసీపీ క్రైమ్స్ లతామాధురి గురువారం సందర్శించారు. రికార్డులు పరిశీలించి, కేసుల వివరాలను తెలుసుకున్నారు. త్వరితగతిన కేసులు డిటెక్ట్ చేయాలని, నేరాలు జరగకుండా పోలీసింగ్ విధులను సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు. సిబ్బందికి పలు అంశాల్లో సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ మోహనరావు, సీఐ బంగారుపాప పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి : ఏఐటీసీయూ

సీతమ్మధార, నవంబరు 21 : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని, అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పడాల గోవింద్ పిలుపునిచ్చారు. గురువారం సీతమ్మధార కూడలిలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్‌ను గోవింద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దేశానికి మూడోసారి ప్రధాని అయిన మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ అంబానీ, అదాని లాంటి కార్పొరేట్ దిగ్గజాలకు తాకట్టు పెడుతూ కార్మికులు, ఉద్యోగులకు తీరని ద్రోహం చేస్తోందని మండిపడ్డారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా, ముడి సరుకులు సరఫరా చేయకుండా ప్రైవేటుపరం చేయాలని కుట్ర పన్నుతోందన్నారు. కార్మికుల సమస్యలు తెలుపుతూ తమ డిమాండ్లతో ఈ నెల 26న అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో డీఆర్ఎం కార్యాలయం నుంచి జీవీఎంసీ వరకు జరిగే ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్.మధురెడ్డి, రావి అశోక్, శ్రీను, శివ, సతీష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీపై సభా సంఘం సముచిత నిర్ణయం

» కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్



సీతంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విశాఖ డెయిరీ అక్రమాలపై అసెంబ్లీలో చర్చ జరిపి సభా సంఘం వేయడం సముచిత నిర్ణయమని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ పేర్కొన్నారు. ద్వారకానగర్‌లో గల పౌర గ్రంథాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ డెయిరీలో జరిగిన అక్రమాలపై పూర్తి స్థాయిపై విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. కొక్కిరాపల్లిలో 20 ఎకరాల డెయిరీ భూమిని ఆడారి కుటుంబం ఆక్రమించుకొందని, పాల ధరపై పాడి రైతులకు ఇచ్చే డబ్బుల్లో రూ.మూడు తగ్గించేశారని ఆరోపించారు. ప్రస్తుతం ఛైర్మన్‌గా ఉన్న ఆడారి ఆనంద్, అతని కుటుంబ సభ్యుల అవినీతి, విశాఖ డెయిరీ డైరెక్టర్ ఆస్తులపై పూర్తి విచారణ చేపట్టాలని మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కేసులో తప్పించుకు తిరుగుతున్న అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన నిందితుడు గొల్లోరి కేశవరావును రైల్వే పోలీసులు గురువారం పట్టుకున్నారు. ప్లాట్‌ఫామ్‌పై తనిఖీలు చేస్తుండగా, అదే సమయంలో గంజాయి రవాణాకు రెక్కీ నిర్వహిస్తున్న కేశవరావు పట్టుబడ్డాడని రైల్వే పోలీసులు తెలిపారు. అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ధనుంజయనాయుడు పేర్కొన్నారు.

పెరిగిన వాయు కాలుష్యం

... 5వ పేజీ తరువాయి

ఏరియాలో ఉండడం కారణాలుగా చెప్పవచ్చు. నగరం చుట్టూ ఉన్న కొండల కారణంగా విశాఖలో శీతాకాలం ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి. దీంతో పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్య కారకాలు పైకి వెళ్లకుండా భూమి ఉపరితలంపై ఉండిపోతున్నాయి. దీంతో వాతావరణంలో ధూళి కణాలు, సల్ఫర్ డై ఆక్సైడ్ వంటి ఉద్గారాలు పెరుగుతున్నాయి. ఇంకా నగరంలో ఏటేటా పెరుగుతున్న వాహనాల వల్ల ధూళి పెరుగుతుంది. అలాగే నగరంలో భవన నిర్మాణాలు సమయంలో యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ధూళి గాలిలో కలుస్తోంది. ఇదిలావుండగా నగరంలో కాలుష్య తీవ్రత తగ్గించడానికి కేంద్రం ఇచ్చిన నిధులను గత వైసీపీ ప్రభుత్వం దారిమళ్లించింది. చెట్ల పెంపకం విరివిగా చేపట్టాలన్న ప్రణాళిక తూతూమంత్రంగా కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో గతంతో పోల్చితే విశాఖపట్నంలో కాలుష్యం ఏడు రెట్లు పెరిగిందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గురువారం శాసనమండలిలో ఆందోళన వ్యక్తంచేశారు. కాలుష్య ప్రభావం తగ్గించేందుకు చర్యలు చేపట్టామన్నారు. దీనిపై పీసీబీ అధ్యయనం చేస్తోందని, 2025 జనవరిలో నివేదిక వస్తుందని..దానిని బట్టి తగిన కార్యాచరణ చేపడతామన్నారు. శీతాకాలంలో నగరంలో కాలుష్య తీవ్రతకు గట్టి చర్యలు తీసుకుంటున్నట్టు కాలుష్య నియంత్రణ మండలి ఈఈ పి.ముకుందరావు తెలిపారు. హెచ్‌పీఎసీఎల్‌లో తక్కువ సల్ఫర్ ఉన్న ముడి చమురు వాడాలని ఆదేశించామన్నారు. మిగిలిన కాలుష్య కారక పరిశ్రమల్ని అప్రమత్తం చేశామన్నారు.

అప్‌గ్రేడేషన్‌పై ఆశలు

... 5వ పేజీ తరువాయి

కంటి ఆస్పత్రి పోటీపడ్డాయి. ఇక్కడి ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు అప్పట్లో వేగంగా స్పందించడంతో ప్రక్రియ ముందుకుసాగింది. అప్‌గ్రేడ్ జరిగితే రెటీనా, కార్నియా, గ్లకోమా, స్క్వింట్ అండ్ ఆక్లోప్లాస్టియా (కంటి ప్లాస్టిక్ సర్జరీ) వంటి విభాగాలను ఏర్పాటుచేస్తారు. నిపుణులు, అధునాతన లేబొరేటరీ, అనస్థీషియా విభాగం, స్టాఫ్ నర్సులు, థియేటర్ అసిస్టెంట్లు, పారా మెడికల్ సిబ్బందిని కేటాయిస్తారు. నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్ (ఎన్‌పీసీబీ) రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకూ నిధులు ఇస్తుంది. ఆస్పత్రిలో ప్రస్తుతం ఉన్న పడకల సంఖ్య మూడు నుంచి నాలుగు రెట్లు పెరుగుతుంది. దీనివల్ల ఎక్కువమంది రోగులకు వైద్య సేవలందించేందుకు, శస్త్రచికిత్సలు చేసేందుకు వీలుంటుంది.

ముందుకు కదిలేనా..?

రాష్ట్రంలో ఎన్ని కంటి ఆస్పత్రులున్నప్పటికీ ఒక్క ఆస్పత్రినే కేంద్రం ఆర్ఐవోగా అప్‌గ్రేడ్ చేస్తుంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రతిపాదనకు మోక్షం లభిస్తుందని భావిస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దలు, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళితే ప్రయోజనం లభిస్తుందంటున్నారు. కర్నూలు ఆస్పత్రి అధికారుల్లోనూ ఇదే ఆలోచన ఉన్న నేపథ్యంలో ఇక్కడి ఎంపీలు, ఎమ్మెల్యేలు వేగంగా స్పందించాల్సి ఉంది. దీని గురించి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి వద్ద ప్రస్తావించగా ఇటీవల ఉన్నతాధికారులకు విషయం గుర్తుచేశామన్నారు. రాష్ట్రంలోని ఏ ఆస్పత్రికి ఆర్ఐవో అప్‌గ్రేడేషన్ దక్కలేదని, విశాఖకు లభించేలా తమవంతు కృషి చేస్తామన్నారు.

ట్రాఫిక్ ఎస్‌ఐపై సస్పెన్షన్ వేటు

... 5వ పేజీ తరువాయి

ఎస్ఐ భాస్కరరావు, రైటర్ జయరావును విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. పోలీస్ శాఖలో ఎవరైనా అవినీతి, అక్రమాలకు పాల్పడినట్టు తెలిస్తే 7995095799 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీపీ విజ్ఞప్తి చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహించినా, అవినీతికి పాల్పడినా కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

ప్రసాదరెడ్డి అక్రమాలపై విచారణ చేపట్టాలి

... 5వ పేజీ తరువాయి

నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని వారిని గ్రేడ్లుగా పెట్టి సీనియర్ ప్రొఫెసర్లను అవమానించారన్నారు. రూసా పథకం కింద కేంద్రం ఇచ్చిన నిధులను దుర్వినియోగం చేశారంటూ ఆరోపించారు. ఏయూలో రెగ్యులర్ ప్రొఫెసర్లను పక్కనపెట్టి ఎయిడెడ్ కాలేజీలనుంచి లెక్చరర్లను తెచ్చి ప్రొఫెసర్లుగా నియమించి సొంత సైన్యాన్ని తయారుచేసుకున్నారని పేర్కొన్నారు. గడిచిన ఐదేళ్లలో వర్సిటీని ఆయన భ్రష్టుపట్టించిన తీరుపై పత్రికలు కథనాలు ప్రచురించాయన్న పల్లా శ్రీనివాసరావు..ఆ వివరాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. వర్సిటీకి సంబంధించిన కీలక దస్త్రాలను మాయం చేశారని, వీటన్నింటిపై పూర్తిస్థాయి విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అండర్ స్టాండింగ్!

... 5వ పేజీ తరువాయి

ఉన్నారు. వీరంతా ఉన్నప్పటికీ జోన్-3 పరిధిలోని 21వ వార్డు బీచ్‌రోడ్డులో పారిశుధ్య నిర్వహణకు 30 మంది కార్మికులను నెలరోజులపాటు నామినేషన్ పద్ధతిలో నియమించారని చెప్పి ఒక కాంట్రాక్టర్‌కు రూ.4.65 లక్షలు బిల్లు చెల్లించేందుకు ఎజెండాలో ప్రతిపాదించారు. అలాగే ప్రతి వార్డు సచివాలయానికి ఒక క్లాప్ వాహనం చెత్త తరలించేందుకు ఉండగా, చెట్ల వ్యర్థాలు, డెబ్రిస్ తరలించేందుకు జీవీఎంసీకి చెందిన వాహనాలు ప్రత్యేకంగా ఉన్నాయి. అయినప్పటికీ జోన్-2 పరిధిలోని ఐదు నుంచి 13వ వార్డు వరకూ చెట్ల వ్యర్థాలు తరలించేందుకు రెండు వాహనాలను నెల రోజులుపాటు పెట్టినందుకు కాంట్రాక్టర్‌కు రూ.4.48 లక్షలు చెల్లించాలంటూ ఎజెండాలో ప్రతిపాదించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అలాగే జోన్-2 పరిధి 5,6,7 వార్డుల్లో చెత్త సేకరించడానికి క్లాప్ వాహనాలకు అదనంగా మూడు టాటా ఏస్ వాహనాలను పెట్టిన కాంట్రాక్టర్‌కు రూ.4.86 లక్షలు చెల్లించాలని ఎజెండాలో చేర్చడం విశేషం. వీటన్నింటినీ స్టాండింగ్ కమిటీ సభ్యులు తిరస్కరించాలని భావించినప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్లకు ఫోన్ చేసి కొందరు సభ్యులు మాట్లాడగా పది శాతం కమీషన్ ఇచ్చేందుకు అంగీకరించడంతో వాటిని ఆమోదించాలని తీర్మానించుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. వీటితోపాటు జీవీఎంసీ పరిధిలో ఎక్కువ వెలుతురునిచ్చే సామర్థ్యం కలిగిన వీధి దీపాలు ఏర్పాటు, ప్రతి జోన్‌లో పాములు పట్టుకునేందుకు ఒక క్యాచర్‌ను రూ.పది వేల వేతనానికి నియమించుకోవడం, వీధికుక్కలను పట్టుకుని ఆపరేషన్లు చేసేందుకు వాహనాలను సమకూర్చుకోవడం, నగరంలో నిరాశ్రయుల షెల్టర్లలో పనిచేస్తున్న సిబ్బంది ఏడాదిపాటు పొడిగింపు, షెల్టర్‌లో ఉండేవారికి భోజనాలు సమకూర్చే అంశాలను ఎజెండాలో చేర్చారు. 70, 76, 96 వార్డుల్లో అభివృద్ధి పనులు, దుకాణాల వేలం వంటి అంశాలను ఎజెండాలో చేర్చారు.

డ్రై డే తప్పనిసరి : వైద్యులు

జగదాంబ కూడలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలు వారంలో ఒక రోజు తప్పనిసరిగా డ్రై డే పాటించాలని ప్రజారోగ్య విభాగం అధికారులు సూచించారు. గురువారం వారు పోర్టు అథారిటీ అధికారులతో కలిసి వన్‌టౌన్ పరిధిలోని కోటవీధి, అంబుసరంగ్ వీధి, ఫెర్రీ రోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు తరచూ జ్వరాల బారిన పడుతుండడంతో నీటి నిల్వలను పరీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్లల్లోనూ, పరిసరాల్లో నీటి నిల్వల వల్ల దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. డ్రమ్ములు, ట్యాంకులు, పూల కుండీల్లో నీటి నిల్వలు లేకుండా వారంలో ఒక రోజు డ్రై డే పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు విజయ్, పోర్టు అథారిటీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు జరిమానా

పూర్ణామార్కెట్,నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆటోలో పరిమితికి మించి స్కూల్ పిల్లలను ఎక్కించిన డ్రైవర్‌పై వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, పది వేల రూపాయల జరిమానా విధించారు. గురువారం పూర్ణామార్కెట్ దరి రాజారామ్మోహన్‌రాయ్ రోడ్డు నుంచి జగదాంబ వైపు వెళ్తున్న స్కూల్ ఆటోలో ఏకంగా 20 మంది పిల్లలు ఉన్నారు. ఈమేరకు వన్‌టౌన్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ విశ్వనాథ్ ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, జరిమానా విధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను, స్కూల్ పిల్లలను ఎక్కిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

2 నుంచి కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు

మహారాణిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో వచ్చే నెల 2 నుంచి 30 వరకు మార్గశిర మాసోత్సవాలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి

పూర్ణామార్కెట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హార్బర్ పోలీస్ స్టేషన్ ఏసీపీ ఎన్. కాళిదాసు చెప్పారు. గురువారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో యువతరం, మత్తు పదార్థాలు, వినియోగం అన్న అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితాలు నాశనం అవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ జీడిబాబు, తదితరులు పాల్గొన్నారు.



మెరైన్ మత్స్యకార మ్యూజియమ్‌లో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

పథకాలపై అవగాహన అవసరం

ప్రపంచ మత్స్యకారుల దినోత్సవంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన అవసరమని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా భారతీయ మత్స్య పరిశోధనా సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సముద్రం జలాలు కలుషితం కాకుండా చూడడంతో పాటు మత్స్య సంపద పరిరక్షణ మత్స్యకారుల బాధ్యత అని చెప్పారు. జిల్లాలో 32 తీర గ్రామాలు ఉండగా 15 ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. సుమారు రూ. 178 కోట్లతో ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయన్నారు. బోట్ల ఫిట్‌నెస్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని, పనికిరాని వలలను, వ్యర్థాలను సముద్రంలో వేయకూడదని సూచించారు. అంతకముందు ఆయన మెరైన్ మ్యూజియంను సందర్శించారు.ఈ కార్యక్రమంలో మెరైన్ ఎస్పీ రవివర్మ, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి. లక్ష్మణరావు, డి. బామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో...

మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం రాయితీలు కల్పించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి కోరారు. గురువారం బీచ్‌రోడ్డులో విశాఖ మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు అల్లిపల్లి ఎల్లజీ ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్యకారులను ఆర్థికంగా ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. అలాగే సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. అనంతరం అన్న దానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు జింతపల్లి పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని వైద్య సిబ్బంది

జోనల్ కమిషనర్ ఆగ్రహం



హాజరుపట్టిక పరిశీలిస్తున్న జడ్సీ రాము

జ్ఞానాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9 గంటలకు ఓపీ ప్రారంభం కావాల్సి ఉండగా 10 గంటలకు కేవలం స్టాఫ్ నర్సు, డేటా ఎంట్రీ ఆపరేటర్ తప్ప మిగతా సిబ్బంది రాకపోవడంతో రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ఈ కేంద్రంలో మొత్తం ఏడుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఎక్కువగా వృద్ధులు, మహిళలు వస్తుంటారు. వారు షుగర్ పరీక్ష చేయించుకోవాలంటే ఎటువంటి ఆహారం తీసుకోకూడదు. దీంతో సిబ్బంది ఆలస్యంగా రావడంతో వారంతా అవస్థలు పడుతున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు మెడికల్ ఆఫీసర్, ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్సు కేంద్రంలో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలి. కానీ ఎవరూ పూర్తి సమయం ఉండడం లేదు. ఈవిషయమై స్థానికులు జోన్-5 జడ్సీ బి. రాముకు ఫిర్యాదు చేయడంతో ఆయన గురువారం ఉదయం కేంద్రాన్ని తనిఖీలు చేశారు. ఉదయం 9.30 గంటలకు ఇద్దరే ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది తీరు గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. హాజరుపట్టికను పరిశీలించి, సమయపాలన పాటించాలని లేకపోతే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. మరోసారి రోగుల నుంచి ఎటువంటి ఫిర్యాదు రాకుండా చూసుకోవాలని సూచించారు.

సామాజిక సేవే లక్ష్యం

డాబాగార్డెన్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చివరి శ్వాస వరకు సామాజిక సేవే తన లక్ష్యమని ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది బైపా అరుణ్‌కుమార్ అన్నారు. గురువారం డాబాగార్డెన్స్ బీవీకే ఛాంబర్స్‌లో అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో అరుణ్‌కుమార్‌కు ఆంధ్రరత్న పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన తన జీవితాంతం సమాజానికి సేవలందిస్తానన్నారు. సమాఖ్య కన్వీనర్ డా. గణగళ్ల విజయకుమార్ మాట్లాడుతూ 1969 నుంచి ఇప్పటివరకు పలు సామాజిక సేవా రంగాల్లోనూ, న్యాయవాద వృత్తి ద్వారా అరుణ్‌కుమార్ పేదలకు సేవలందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

'ఆకాశం నీ హద్దురా' పోస్టర్ ఆవిష్కరణ

డాబాగార్డెన్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విభిన్న హావభావాలను తన నటనతో పలకించే గొప్ప నటుడు కమల్‌హాసన్ అని మాజీ ఏడీసీపీ మహమ్మద్‌ఖాన్ అన్నారు. గురువారం డాబా గార్డెన్స్‌లో గీత్ సంగీత్ ఆధ్వర్యంలో 'ఆకాశం నీ హద్దురా' కమలహాసన్ ప్రత్యేక సినీ సంగీత విభావరి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 23న గీత్ సంగీత్ సంస్థ ఆధ్వర్యంలో కమల్‌హాసన్ నటించిన చిత్ర గీతాలతో ప్రత్యేక సంగీత విభావరి విశాఖ పౌర గ్రంథాలయంలో జరగనుందన్నారు. సంగీత ప్రియులు, కమల్‌హాసన్ అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మనోహర్, కోరుకొండ రంగారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తికి పదేళ్లు జైలు

డాబాగార్డెన్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గంజాయి కలిగిఉన్న వ్యక్తికి పదేళ్లు జైలు శిక్ష విధిస్తూ నగరంలోని ఒకటవ ప్రధాన మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం. వెంకటరమణ గురువారం తీర్పునిచ్చారు. జైలు శిక్షతో పాటు లక్ష రూపాయలు జరిమానా చెల్లించాలని లేనిపక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రసాదరావు తెలిపిన వివరాలు ప్రకారం.. ఒడిశాలోని కోరాపుట్ జిల్లాకు చెందిన హర్షిత్‌ఖాన్ అనకాపల్లి జిల్లా కొత్తూరు సమీపంలో రోడ్డు పక్కన 20 కిలోలు గంజాయితో 2021 ఆగస్టు 19న కొత్తూరు పోలీసులకు పట్టుబడ్డాడు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి అతనికి పదేళ్లు జైలు శిక్షతో పాటు రూ. లక్ష జరిమానా విధించారు.

తల్లి చెంతకు బాలుడు

జగదాంబ కూడలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తప్పిపోయిన ఏడేళ్ల బాలుడ్ని పోలీసులు కొన్నిగంటల వ్యవధిలో తల్లి చెంతకు చేర్చారు. మహారాణిపేట సీఐ భాస్కర్ తెలిపిన వివరాలు ప్రకారం.. వన్‌టౌన్ ఏరియాకు చెందిన ఏడేళ్ల బాలుడు బుధవారం మధ్యాహ్నం తప్పిపోవడంతో తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈమేరకు గురువారం ఉదయం ఆ బాలుడు టూ టౌన్ పరిధిలో కనిపించడంతో పోలీసులు బాలుడ్ని తీసుకువచ్చి తల్లికి అప్పగించారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ ఓవరాల్ చాంప్ విశాఖ



విజేత విశాఖ జట్టుకు బహుమతి ప్రదానం

మచిలీపట్నం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కృష్ణా జిల్లాకేంద్రం మచిలీపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి 38వ బాక్సింగ్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఇందులో విశాఖ క్రీడాకారులు మూడు కేటగిరీల్లోనూ ఉత్తమ ప్రతిభ చాటారు. అండర్ 14, అండర్ 17 బాలురు విన్నర్స్‌గా నిలవగా, అండర్ 17 బాలికలు ప్రథమస్థానం సాధించారు. విజేతలకు మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి బహుమతులు అందించారు.

తప్పుడు పత్రాలు సమర్పిస్తే కేసులు

... 5వ పేజీ తరువాయి

ఎవరో తెలుసుకుంటే చాలా వరకూ మోసపోకుండా ఉండడానికి అవకాశం ఉంటుంది.

ప్ర: ప్రజలకు స్టాంపు పేపర్లు అందుబాటులో తెచ్చారా?

జ: సుమారు రూ.12 కోట్ల విలువైన స్టాంపు పేపర్లు తొలి విడతలో తెప్పించాం. రూ.100 విలువైనవి 72 వేలు, రూ.50 విలువైనవి 80 వేలు, ఇంకా రూ.20, రూ.10 విలువ కలిగినవి కూడా తెప్పించాం. జిల్లాలోని తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోను అందుబాటులో ఉన్నాయి. స్టాంపు విక్రేతలకు కూడా ఇచ్చాం.

ప్ర: స్టాంపు పేపర్లను పాత తేదీలు వేసి విక్రయిస్తే ఏం చేస్తారు?

జ: గతంలో ఇలాంటివి జరిగేవి. ఇప్పుడు అవకాశం లేదు. దీనికి ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ తీసుకువచ్చారు. ఎవరికి స్టాంపు పేపర్ విక్రయించినా ఆన్‌లైన్‌లో పేరు, తేదీ నమోదు చేయాల్సిందే. కొన్నవారి మొబైల్ నంబరుకు ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేశాకే స్టాంపు పేపరు ఇవ్వాల్సి ఉంటుంది. ఎవరి దగ్గర ఎన్ని స్టాంపు పేపర్లు ఉన్నాయో కూడా లెక్క తెలిసిపోతుంది. స్టాకు ఉంచుకొని ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటాం. స్టాంపు విక్రేతలు ఇండెంట్ పెట్టాలన్నా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి.

ప్ర: ఈ స్టాంపింగ్ (జెరాక్స్) డాక్యుమెంట్‌కు స్వస్తి పలికినట్టేనా?

జ: కక్షిదారులు ఏది కోరుకుంటే దానిపైనే డాక్యుమెంట్ ఇస్తాం. ప్రభుత్వం నుంచి అయితే ఈ స్టాంపింగ్ ఆపేయాలని ఉత్తర్వులు రాలేదు. ఇప్పుడు అంతా రూ.100 స్టాంపు పేపర్లపైనే లావాదేవీలు రాసుకొని, వాటిపైనే డాక్యుమెంట్లు తీసుకుంటున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కూర్మన్నపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కూర్మన్నపాలెం కేబీఆర్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంటన్నర వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు జోన్-2 ఈఈ టీకే నాయుడు, ఏడీఈ రామకృష్ణలు తెలిపారు. ఈ కారణంగా శాతవాహన నగర్, యాతపాలెం, ముస్తఫా జంక్షన్, భరత్‌నగర్, కూర్మన్నపాలెం, ఐటీఐ రోడ్డు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఐటీఐ విద్యార్థి అదృశ్యం


కిరణ్ తేజ (ఫైల్)

పెందుర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ చదువుతున్న ఓ విద్యార్థి అదృశ్యమైనట్టు గురువారం పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు అందింది. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఇక్కడి ప్రశాంతినగర్‌కు చెందిన శంభాన కిరణ్‌తేజ (17) కంచరపాలెంలోని ఐటీఐ కళాశాలలో ప్లంబింగ్ విభాగంలో ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 11న కళాశాలకని ఇంటి నుంచి వెళ్లిన కిరణ్ తేజ పది రోజులైనా తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో విద్యార్థి తండ్రి రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

ఎన్.ఎ.డి.జంక్షన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు పరిధి సుసర్ల కాలనీ నుంచి లక్ష్మీనగర్ ఎఫ్-బ్లాక్ అమ్మవారి పాదాల వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం కార్పొరేటర్ బొమ్మిడి రమణ పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పబ్లిక్ వర్క్స్ ఏఈ వెంకటలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, టీడీపీ నాయకులు మాణిక్యం, పట్నాయిక్, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఆదర్శ్'లో జాబ్ మేళా

పెందుర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కరస్పాండెంట్ టి.థియోఫిలస్ తెలిపారు. అచ్యుతాపురం సెజ్‌లో గల యెకహోమా కంపెనీలో మహిళలకు మాత్రమే గల వివిధ విభాగాల్లో ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసిన వారితో పాటు ఆఖరి సంవత్సరం చదువుతున్నవారు కూడా ఈ మేళాకు హాజరు కావచ్చన్నారు. ఆసక్తి గల 18 నుంచి 24 ఏళ్లలోపు మహిళలు బయోడేటా, సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

వృద్ధులకు వీల్‌చైర్లు పంపిణీ

శ్రీనగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 71వ వార్డు పరిధి శ్రీనగర్‌లో గురువారం బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు చేతుల మీదుగా పలువురు వృద్ధులకు వీల్‌చైర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన వయోశ్రీ పథకం ద్వారా వయోవృద్ధులకు అవసరమైన చేతికర్ర, కమోడ్, వినికిడి మిషన్, కళ్లజోళ్లు, వీల్‌చైర్లు వంటి ఉపకరణాలను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు జీలకర్ర రమణ, భువనేశ్వరి, రోహిణి, దిలీప్, రంగనాయకులు, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **మెకానిక్ రాఖీ:** మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)

● **దేవకీనందన వాసుదేవ:** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)

● **జీబ్రా:** శారద, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)

● **కంగువా:** సంగం, రమాదేవి, శ్రీరామ, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక)

● **లక్కీభాస్కర్:** వెంకటేశ్వర

● **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 36, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 24, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 40, బీరకాయలు 34, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 34, క్యారెట్ 70, దొండకాయలు 34, బంగాళదుంపలు 40, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 50, మునక్కాడలు (కిలో) 80, బరబాటి 30, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 36, దోసకాయలు 25, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్(పెన్సిల్) 55, పొటల్స్ 44, కీరదోస 22, క్యాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 32, కంద 66, దేముడు చిక్కుడు 75, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన(కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, క్రరపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
ఫారం ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

జీవీఎంసీ శ్రీహరిపురం ఆస్పత్రికి మహర్దశ

దత్తత తీసుకునేందుకు ముందుకు వచ్చిన 'కోరమాండల్' అనుబంధ సంస్థ ఏఎంఎం ఫౌండేషన్

ప్రక్రియ పూర్తయితే పారిశ్రామిక వాసులకు నిరంతరం అందుబాటులో వైద్యం


శ్రీహరిపురంలోని జీవీఎంసీ ఆస్పత్రి

మల్కాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ శ్రీహరిపురం ఆస్పత్రికి త్వరలో మహర్దశ పట్టనున్నది. ఇంతకాలం అరకొర వైద్య సేవలతో నడుస్తున్న ఈ ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్య సేవలు, మందులు అందించేందుకు కోరమాండల్ ఎరువుల కర్మాగారం సంస్థ ముందుకు వచ్చింది. ఇందులో భాగంగానే కోరమాండల్ సంస్థలో భాగమైన మేనిజింగ్ టస్ట్రీ ఏఎంఎం ఫౌండేషన్ ఈ ఆస్పత్రిని దత్తత తీసుకునేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో గురువారం శ్రీహరిపురంలోని ఆస్పత్రిని ఏఎంఎం ఫౌండేషన్ ముఖ్య ప్రతినిధి ఎంఏ అలగప్పన్ పరిశీలించారు. ఇప్పటికే ఈ ఆస్పత్రికి కోరమాండల్ సంస్థ తాగునీటి సౌకర్యాన్ని కల్పించింది. ఇప్పుడు ఏకంగా పూర్తి స్థాయిలో వైద్య సేవలందించేందుకు ప్రణాళికలను రూపొందించింది. అన్నీ సజావుగా జరిగితే పారిశ్రామిక ప్రాంత ప్రజలకు సంపూర్ణమైన ఆరోగ్య సేవలు అందుతాయని చెప్పవచ్చు. ఇప్పటివరకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మాత్రమే అంతంతమాత్రంగా ప్రజలకు వైద్య సేవలందుతున్నాయి. ఏఎంఎం ఫౌండేషన్ దత్తత తీసుకుంటే 24 గంటలూ ప్రజలకు వైద్య సేవలు అందుతాయి. కాగా పది రోజుల క్రితం కోరమాండల్ సీఎస్ఆర్ సిబ్బంది కూడా ఆస్పత్రి ఎంత విస్తీర్ణంలో ఉందో కొలతలు తీయించి ఏఎంఎం ఫౌండేషన్‌కు పంపినట్టు తెలిసింది. కోరమాండల్ సంస్థ ఇప్పటికే కొత్తనక్కవానిపాలెంలో ఓ ప్రైవేటు భవనంలో ఆస్పత్రిని ఏర్పాటు చేసి పది రూపాయలకే వైద్య సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందుతుంది. తాజాగా శ్రీహరిపురం ఆస్పత్రిని దత్తత తీసుకునేందుకు ముందుకు రావడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.





పాఠశాలలను సందర్శించిన డీఈవో


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

నిర్వహణ, బోధనాంశాల తీరుపై సంతృప్తి

నెల్లిముక్కు స్కూల్‌లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన ప్రేమ్‌కుమార్

పెదగంట్యాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలలను గురువారం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ సందర్శించారు. పాఠశాలల నిర్వహణ, స్థితిగతులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. మండల విద్యాశాఖ కార్యాలయం, నెల్లిముక్కు ప్రాథమిక పాఠశాల, గంగవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించే సందర్భంలో బోధనా సామగ్రి వినియోగం, వర్క్ బుక్స్ నిర్వహణ, పాఠ్యాంశాలను విద్యార్థులు ఎలా అర్థం చేసుకుంటున్నారన్న అంశాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఎంఈవోలు, ఉపాధ్యాయులు బోధనలో మెరుగైన ఫలితాలను సాధించి జిల్లా ముందు వరుసలో నిలబడటం పట్ల డీఈవో ప్రత్యేకంగా అభినందించారు. ఇదే విధానంతో మరింత కష్టపడి విద్యాశాఖకు మంచి పేరు తీసుకురావాలని డీఈవో సూచించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

అనంతరం నెల్లిముక్కు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి ప్రేమ్‌కుమార్ మధ్యాహ్న భోజనం చేశారు. ఆయన వెంట ఎంఈవోలు ఈ.శ్రీనివాసరావు, కె.రమణాజీ, తదితరులు ఉన్నారు.



సమస్యల పరిష్కారం కోసం విశాఖ డెయిరీ కార్మికుల దీక్షలు


రిలే నిరాహార దీక్షల శిబిరంలో నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేతన సవరణతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విశాఖ డెయిరీ కార్మికులు సంస్థ మెయిన్ గేటు వద్ద గురువారం రిలే నిరాహార దీక్షలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా విశాఖ డెయిరీ కో-ఆపరేటివ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.రమణ మాట్లాడుతూ గత 24 ఏళ్లుగా కార్మికులకు కనీస వేతనాలతో పాటు ఎటువంటి కనీస హక్కులు కల్పించకుండా డెయిరీ యాజమాన్యం కార్మికుల శ్రమను దోచుకోవడం దారుణమన్నారు. ఈ నెల ఒకటిన తమ తమ డిమాండ్లను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లితే ఏ ఒక్కదానికి అంగీకారం తెలపకపోవడంతో తాము రిలే నిరాహార దీక్షలకు దిగామన్నారు. యూనియన్ అధ్యక్షుడు కె.వరహామూర్తి మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను డెయిరీ యాజమాన్యం త్వరగా పరిష్కరించకపోతే డిసెంబరు ఐదో తేదీ తర్వాత డెయిరీలోని అన్ని విభాగాల కార్మికులు విధులు బహిష్కరించి ఆందోళనకు దిగుతారని హెచ్చరించారు. దీక్షల్లో యూనియన్ నాయకులు ఈశ్వరరావు, భాస్కరరావు, నాగ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు. కాగా డెయిరీ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు సీఐటీయూ బెల్ హెచ్‌పీవీపీ నాయకులు జీటీపీ ప్రకాశ్, సనపల జగన్నాథరావు, అప్పారావు, తదితరులు సంఘీభావం తెలిపారు.



పోస్టు కార్డుల ఉద్యమాన్ని విజయవంతం చేయాలి

ఉక్కు పరిరక్షణ కోసం 2న చలో కలెక్టరేట్

ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వీవీ రమణమూర్తి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రమణమూర్తి, పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగార పరిరక్షణ కోసం ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వరకు చేపట్టిన పది లక్షల పోస్టు కార్డుల ఉద్యమాన్ని అందరూ విజయవంతం చేయాలని సంస్థ కన్వీనర్ వీవీ రమణమూర్తి కోరారు. కూర్మన్నపాలెంలో చేపట్టిన పోరాట కమిటీ దీక్షల శిబిరానికి గురువారం సంస్థ ప్రతినిధులు విచ్చేసి కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణకు ప్రతి తెలుగువాడు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. డిసెంబరు రెండున నగరంలోని సరస్వతి పార్కు నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవడంతో పాటు రూ.పది వేల కోట్ల సాయాన్ని అందించాలని, ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలని, ఉక్కు నిర్వాసితులకు పర్మినెంటు ఉద్యోగాలు కల్పించాలని, కాంట్రాక్టు కార్మికులకు పర్మినెంటు చేయాలని, మిగుల భూములను నిర్వాసితులకు అందించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్రలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలంటూ ప్రతి ఇంటి నుంచి ఓ పోస్టు కార్డును రాసి ప్రధాని మోదీకి పంపేందుకు ఏర్పాట్లు చేశామని రమణమూర్తి పేర్కొన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, బూసి వెంకటరావు, పరంధామయ్య, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

24న సీఐటీయూ నిరసన ప్రదర్శన

మల్కాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక విధానాలను నిరసిస్తూ ఈ నెల 24న పాత గాజువాకలో ప్రదర్శన, 26న రైల్వే డీఆర్ఎం కార్యాలయం నుంచి జీవీఎంసీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ మల్కాపురం జోన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.పెంటారావు, ఆర్.లక్ష్మణమూర్తిలు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను మల్కాపురంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటుతో పాటు ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, కార్మికులను నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, ఆటో, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పైడిరాజు, ఎం.కృష్ణారావు, కె.సత్యనారాయణ, జి.రాంబాబు, తాతబాబు, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరుకల్లా పార్కు నిర్మాణాన్ని పూర్తి చేయాలి: జీవీఎంసీ సీఈ

పెదగంట్యాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 76వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలోని అల్లూరి సీతారామరాజు పార్కు నిర్మాణ పనులను డిసెంబరు నెలాఖరుకల్లా పూర్తి చేయాలని సీఈ శివప్రసాదరావు సిబ్బందికి ఆదేశించారు. టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు, ఇతర సాంకేతిక సిబ్బందితో కలిసి గురువారం ఆయన పార్కు నిర్మాణ పనులను పరిశీలించారు. సుమారు రూ.పది కోట్లతో చేపట్టిన పార్కు పనులను పూర్తి సంక్రాంతి నాటికి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాలని సీఈకి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈఈ ఎంఆర్ఎస్ అప్పారావు, డీఈ హెచ్.దామోదర్, ఏఈ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జీతాల కోసం నేడు ఉక్కు పరిపాలనా భవనం వద్ద ధర్నా

సీఐటీయూ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి రామస్వామి

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ప్లాంట్ పరిపాలనా భవనం వద్ద చేస్తున్న ధర్నాలో ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా సీఐటీయూ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి కోరారు. యూనియన్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు ఉద్యోగులకు జీతాలు చెల్లించకుండా యాజమాన్యం ఇబ్బందులకు గురి చేస్తుండడం దారుణమన్నారు. వేతనాలు అందకపోవడంతో ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అధ్యక్షుడు వైటీ దాసు మాట్లాడుతూ ప్లాంటులో పూర్తి స్థాయి ఉత్పత్తిని తీయడంతో ఉక్కు యాజమాన్యం విఫలమైందన్నారు. ప్రభుత్వం స్టీల్‌ప్లాంటుకు ప్యాకేజీలు అంటుందే తప్పా ఆచరణలో కానరావడం లేదన్నారు. సమావేశంలో నాయకులు గంగాధర్, పుల్లారావు, నీలకంఠం, శ్రీనివాస్, శ్రీనివాసరాజు, ముత్యాలనాయుడు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ సొసైటీ సమస్యలు



అచ్చెన్నాయుడికి వినతిపత్రం అందజేస్తున్న సొసైటీ ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఉద్యోగుల జీతాల నుంచి కట్ చేసిన త్రిఫ్ట్ రికవరీలను సొసైటీకి జమ చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు వివరించి త్రిఫ్ట్ సొసైటీ పాలకవర్గ ప్రతినిధులు గురువారం అమరావతిలో వినతిపత్రం అందజేశారు.

ఉద్యోగుల వేతనాల్లో త్రిఫ్ట్ సొసైటీకి చెందిన రికవరీలు జరుగుతున్నాయని, కానీ యాజమాన్యం మాత్రం సొసైటీకి చెల్లించకపోవడం వల్ల నూతన లోన్‌ల మంజూరు చేయలేకపోతున్నామన్నారు. అలాగే పలు ఆర్థిక లావాదేవీలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో సొసైటీ ప్రతినిధులు కె.ఆనంద్‌కుమార్, డి.శ్రీరామచంద్రమూర్తి, ఎం.రమణ, కె.శ్రీనివాస్, మేనేజర్ దామోదరెడ్డి ఉన్నారు.

యాదవ సంఘం నాయకుడు భరణికాన బాబూరావుకు పుత్ర వియోగం


రాజేష్ (ఫైల్)

సబ్బవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, యాదవ సంఘం జిల్లా నాయకుడు భరణికాన బాబూరావుకు పుత్రవియోగం కలిగింది. ఆయన చిన్న కుమారుడు రాజేశ్ (41) గురువారం ఉదయం గుండెపోటుకు గురై మృతి చెందారు. హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్న ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. బాబూరావుకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు కాగా.. రాజేశ్ చిన్న కుమారుడు. రాజేశ్ మృతి వార్త తెలుసుకున్న పలువురు నాయకులు దేవీపురంలోని బాబూరావు స్వగృహానికి తరలివెళ్లి ఓదార్చుతున్నారు. మృతదేహాన్ని ఇక్కడకు తీసుకొస్తున్నట్టు బంధువులు తెలిపారు. శుక్రవారం అంత్యక్రియలు నిర్వహిస్తామన్నారు.

ఘనంగా తపాలా బిళ్ల దినోత్సవం

అగనంపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి సబ్ పోస్టాఫీసు వద్ద గురువారం తపాలా బిళ్ల విడుదల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ పోస్ట్ మాస్టర్ శైలజ మాట్లాడుతూ 1947 నవంబరు 21న మొదటి తపాలా బిళ్ల విడుదలైందని, అప్పట్లో దాని విలువ మూడు అణాలని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు తపాలా శాఖ ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బి.సత్యనారాయణ, బి.చందూరమేశ్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలి

గాజువాక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని ప్రభుత్వ ఐటీఐ స్టాఫ్ అసోసియేషన్ జోన్-1 ప్రాంతీయ సంచాలకులు ఆర్‌వీ రమణ అన్నారు. అసోసియేషన్ జిల్లా సమావేశం గురువారం గాజువాక ప్రభుత్వ ఐటీఐలో గురువారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మారుతున్న సమాజానికి అనుగుణంగా విద్యార్థులను తయారు చేయాలన్నారు. అసోసియేషన్‌ను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో గాజువాక ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండ్ల తొలగింపును నిరసిస్తూ ధర్నా

వేపగుంట, నవంబరు 21: పెందుర్తి రైతుబజారు రహదారి పక్కన తోపుడు బండ్లను పోలీసుల సహకారంతో జీవీఎంసీ అధికారులు తొలగించడాన్ని నిరసిస్తూ సీఐటీయూ నాయకులు గురువారం జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. చిల్లర వర్తకులకు ప్రత్యేక హ్యాకర్ జోన్ ఏర్పాటు చేయాలని చట్టాలు చెబుతున్నా అధికారులు తోపుడు బండ్లను తొలగించడం దారుణమని నాయకులు మండిపడ్డారు. చిరు వ్యాపారు జీవనోపాధికి విఘాతం కలగకుండా చూడాలంటూ జెడ్సీ కె.హైమావతికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జోన్ ఉపాధ్యక్షుడు కె.అప్పలనాయుడు, తోపుడుబండ్ల యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, నాయకులు జగన్, బి.రమణి, మౌలాలి, సత్యనారాయణ, రెడ్డమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గవర కార్పొరేషన్ డైరెక్టర్‌గా వేగి పరమేశ్వరరావు ప్రమాణ స్వీకారం

పెందుర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్‌గా పెందుర్తికి చెందిన వేగి పరమేశ్వరరావు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని బీసీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రమాణం చేశారు.ఈ సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి అభినందనలు తెలిపారు.

శిథిల పాఠశాల వద్ద మొక్కల తొలగింపు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాతయ్యపాలెంలో శిథిలమైన ప్రాథమిక పాఠశాలకు సంబంధించి బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'మందుబాబులకు అడ్డాగా పాఠశాల భవనం' శీర్షికతో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. గురువారం శిథిల భవనం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భారీగా పెరిగిన చెట్లను త్వరలో తొలగించి ఈ స్థలం చుట్టూ కంచె వేస్తామని సిబ్బంది తెలిపారు.

సామూహిక సత్యసాయి వ్రతాలు

కూర్మన్నపాలెం, నవంబరు 21: భగవాన్ సత్యసాయిబాబా జయంత్యుత్సవాల్లో భాగంగా గురువారం వడ్లపూడి, కణితి, కూర్మన్నపాలెంలలో గల సత్యసాయి ధ్యానమందిరాల్లో సామూహిక సత్యసాయి వ్రతాలు నిర్వహించారు. స్థానికులతో పాటు విద్యార్థులు, సత్యసాయి భజన బృందం సభ్యులు పాల్గొని ఓంకారం, సుప్రభాతం, భజనలు, ప్రార్థనలు చేశారు. నారాయణ సేవ, నగర సంకీర్తన, హనుమాన్ చాలీసా, పల్లకీ సేవ చేపట్టారు.





ఉద్యానవనంలో విజ్ఞాన పాఠాలు

అది అరుదైన మొక్కలకు ఆలవాలం. జీవ వైవిధ్యానికి ప్రాణం పోసే ప్రాంగణం. ఉద్యానవన విద్యార్థులకు పాఠాలను బోధించే విజ్ఞాన కేంద్రం. పరిశోధకులకు ప్రయోగశాల. ప్రకృతి ప్రేమికులు, పర్యావరణ పరిరక్షకులకు మార్గదర్శి. అత్యంత అరుదైన, వివిధ దేశాలకు చెందిన మొక్కలతో నగరంలో అడవిని తలపించే పెదవాల్తేరు రాణి చంద్రమణీ దేవి ఆస్పత్రి ఆవరణలోని జీవవైవిధ్య ఉద్యానవనం.

- పెదవాల్తేరు, ఆంధ్రజ్యోతి






మొక్కలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిర్వాహకుడు డాక్టర్ రామమూర్తి

అరుదైన మొక్కల కేంద్రం బయోడైవర్సిటీ పార్కు

- వివిధ దేశాలకు చెందిన 300 రకాల ప్రత్యేక మొక్కల పెంపకం
- పరిశోధకులకు ప్రయోగశాలగా సేవలు
- విశిష్టత తెలుసుకునేందుకు తరలివస్తున్న విద్యార్థులు

పెదవాల్తేరు రాణీ చంద్రమణీదేవి ఆస్పత్రి ప్రాంగణంలోని మూడు ఎకరాల్లో జీవవైవిధ్య (బయోడైవర్సిటీ) ఉద్యానవనం విస్తరించి ఉంది. ఇక్కడ సుమారు 300 రకాలకు పైగా మొక్కలు ఉన్నాయి. ఇందులో దేశ, విదేశాలకు చెందిన అరుదైన మొక్కలు చోటు సంపాదించాయి. ఆర్కిడ్స్, ఎడారి మొక్కలు, శ్రీగంధం, అశ్వగంధ, ఎర్రచందనం, పవిత్రవృక్షాలు, ఔషధ గుణాలున్న మొక్కలు ఇక్కడ మనకు దర్శనమిస్తాయి. కీటకాలను హరించే మొక్కలు ప్రత్యేకం. ప్రతి మొక్క వద్ద దాని ప్రత్యేకతను వివరించే బోర్డులుంటాయి.

అరుదైన మొక్కలన్నీ ఒకేచోట

వివిధ దేశాలకు చెందిన అరుదైన మొక్కలు ఒకేచోట ఉండడంతో వీటిని పరిశీలించి, జ్ఞానం పెంపొందించుకునేందుకు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఈ ఉద్యానవనాన్ని సందర్శిస్తుంటారు. పరిశోధకులు ఈ మొక్కల విశిష్టత తెలుసుకుని, వాటి ద్వారా సమాజానికి మరింత మేలుచేసే అవకాశాలపై పరిశోధనలు సాగిస్తుంటారు. ఫార్మాస్యూటికల్, అగ్రికల్చర్, గ్రామీణాభివృద్ధి, ల్యాండ్ స్కేపింగ్, బోటనీ చదువుతున్న విద్యార్థులతో పాటు ప్రకృతి ప్రేమికులు, ప్రకృతి అధ్యయనకర్తలు ఉద్యానవనాన్ని సందర్శించి, మొక్కల విశిష్టతను తెలుసుకుంటున్నారు.

ప్రవేశం ఉచితమే..

ఈ ఉద్యానవనాన్ని సందర్శించేందుకు ఎలాంటి రుసుము వసూలు చేయరు. మొక్కలపై ఇష్టమున్న వారు నిత్యం సందర్శించే వీలుంది. ఉద్యానవనం నిర్వహణ బాధ్యతలను విశ్రాంత ఆచార్యులు డాక్టర్ రామమూర్తి, మంగతాయారు చూస్తున్నారు. సందర్శకులందరికీ మొక్కల ప్రత్యేకతను వివరిస్తుంటారు. అంతేకాదు ఇక్కడ ప్రత్యేకంగా కేటాయించిన గదిలో మొక్కల విశిష్టత వివరించే చిత్రాలుంటాయి. విరివిగా మొక్కలు పెంచడంతో పక్షులు, సీతాకోక చిలుకలు నిత్యం సందడి చేస్తున్నాయి. ప్రతిరోజూ అధికసంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారు.

భావితరాలకు తెలియాలి



అరుదైన వృక్ష జాతులను భావి తరాలకు అందించడం, వివిధ రకాల మొక్కల విశిష్టతను వివరించడం దీని ఉద్దేశం. ఇందుకోసం ప్రకృతి ప్రేమికులంతా కృషిచేయాలి. సొసైటీ తరఫున వర్క్‌షాప్‌లు నిర్వహించి విద్యార్థులకు మొక్కల ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తున్నాం. ఇంటర్న్‌షిప్ సౌకర్యం కూడా అందిస్తున్నాం. గత నెలలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ పార్కును సందర్శించారు. దశలవారీగా మౌలిక వసతులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా ఇద్దరు గార్డెనర్లను నియమించారు. 2017లో ఏపీ గ్రీన్, అర్బన్ బ్యూటిఫికేషన్, గ్రీన్ అవార్డు లభించింది. 2018, 2021లో ఉత్తమ జీవ వైవిధ్య వనంగా ప్రకటించారు.

- డాక్టర్ రామమూర్తి, వ్యవస్థాపకులు, బయోడైవర్సిటీ పార్కు

యువతిపై దాడి: ఒకరి అరెస్టు

మల్కాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): యువతి పీక నులిమి ఆమె సెల్‌ఫోన్ తస్కరించిన యువకుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మర్రిపాలేనికి చెందిన పుట్ట సాయితేజ (26)కు శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన యువతితో పరిచయం ఉంది. ఇటీవల వారి మధ్య మనస్పర్థలు వచ్చాయి. బుధవారం సాయితేజ శ్రీహరిపురం వచ్చి మాట్లాడేందుకు యత్నించగా ఆమె తప్పించుకుని వెళ్లిపోయింది. దీంతో ఇంట్లోకి ప్రవేశించి ఆమె పీక నులమడంతో కేకలు వేసింది. సెల్‌ఫోన్ పట్టుకుని పారిపోయాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కోరమాండల్ గేటు సమీపంలో సాయితేజను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ విద్యాసాగర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేసులో నిందితుడికి బెయిల్

ఆరిలోవ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కారాగారంలో పనిచేస్తూ గంజాయితో పట్టుబడిన ఫార్మాసిస్టు కడియం శ్రీనివాస్‌కు బుధవారం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అతడిని తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయానికి సరండర్ చేస్తున్నామని జైలు సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్ తెలిపారు. ఈ కేసును జైళ్ల శాఖ డీఐజీ దర్యాప్తు చేస్తారన్నారు. దీంతో సిబ్బందిలో భయాందోళనలు నెలకొన్నాయి.

దోపిడీ కేసులో నిందితుల అరెస్టు

ఎంవీపీ కాలనీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): లుంబినీ పార్కు వద్ద బుధవారం జరిగిన దోపిడీ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల మేరకు.. కొత్తవలసకు చెందిన డి.బాలమురళీకృష్ణ, తునికి చెందిన కోసం శ్రీనివాసరావు లుంబినీ పార్కు సమీపంలో బుధవారం రాత్రి మద్యం సేవిస్తుండగా, నలుగురు యువకులు వచ్చి డబ్బులు అడిగి, దాడి చేసి, సెల్‌ఫోన్, వాచీ తీసుకుని పారిపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు అప్పుఘర్‌కి చెందిన వాసుపల్లి నవీన్, కొమర సోమరాజు, గరికిన ఎల్లాజీలను అరెస్టు చేశారు. ఎద్దు రాజు పరారీలో ఉన్నాడన్నారు.

24న విశాఖ మ్యూజియంలో ఉచిత ప్రవేశం

వెంకోజీపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ హెరిటేజ్ వీక్ సందర్భంగా ఈ నెల 24న పాఠశాల విద్యార్థులు, సందర్శకులకు వైఎంసీఏ సమీపంలోని విశాఖ మ్యూజియంలోకి ఉచిత ప్రవేశం కల్పించనున్నట్టు జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి తెలిపారు. పురావస్తు శాఖ, ఇంటాక్, ప్రదర్శనను ఏర్పాటు చేశాయన్నారు.

‘అత్యాచార బాధితురాలికి న్యాయం చేయాలి’



పీడీఎస్‌వో ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న దృశ్యం


డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో మానవహారం

సిరిపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): న్యాయశాస్త్ర విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్ వో రాష్ట్ర కోశాధికారిఎల్.భాను డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గురువారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పీడీఎస్‌వో) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మానవహారం చేపట్టి నినాదాలు చేశారు. ఇటీవల అత్యాచార ఘటనలు పెరిగిపోయాయన్నారు. పీడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మీ మాట్లాడుతూ నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో నివేదిక ప్రకారం ప్రతిరోజూ దేశంలో 86 మంది మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. వీటికి మూల కారణాలైన వాటన్నింటినీ నిషేధించాలన్నారు. కార్యక్రమంలో పి.విశ్వనాథ్, ఎస్.రుద్రి, జానకి, లైకాన్, తేజనీవ, లోకేష్, కళాశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి..

లా విద్యార్థినికి న్యాయం చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా, మానవహారం చేపట్టారు. మహిళలకు రక్షణ కల్పించాలని కోరుతూ నినాదాలు చేశారు. గంజాయి, మద్యం, మత్తు పదార్థాలను తక్షణం నిషేధించాలన్నారు. అఘాయిత్యాలపై ప్రభుత్వం విచారణ కమిటీని నియమించి, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.ప్రభావతి, వై.సత్యవతి, యూఎస్ఎన్ రాజు, ఎల్‌జేనాయుడు, బొట్టా ఈశ్వరమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఫార్మా సిటీని వీడని నీటి సమస్య

పంపుహౌస్‌లో మూడు మోటార్లూ మొరాయింపు

విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పరవాడలోని రాంకీ ఫార్మాసిటీలో నీటి సమస్య కొనసాగుతోంది. తాడి పంపుహౌస్‌లో మూడు మోటార్లు ఒకేసారి మొరాయించడంతో గత శుక్రవారం నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ పంపుహౌస్‌పై ఆధారపడి పరవాడ, అచ్యుతాపురంలో సుమారు 150 ఫార్మా కంపెనీలు పనిచేస్తున్నాయి. ఒక మోటారును అతి కష్టం మీద బుధవారం బాగు చేసి నీటి సరఫరా ప్రారంభించారు. అది గురువారం ఉదయం మళ్లీ మొండికేసింది. అత్యధిక సామర్థ్యం కలిగిన ఈ మోటార్లను మరమ్మతు చేసే టెక్నీషియన్లు విశాఖపట్నంలో ఇద్దరే ఉన్నారు. వారిలో ఒకరు కాకినాడ వెళ్లిపోగా మరొకరు అధికారుల తీరు నచ్చక ఐదేళ్లుగా దూరంగా ఉన్నారు. ఏపీఐఐసీ అధికారులు విశాఖలో టెక్నీషియన్‌తో మాట్లాడి మరమ్మతులు ప్రారంభించారు. ఒక్కో పంపును బయటకు తీయడానికి 8 గంటలు, మరమ్మతులకు రెండు గంటలు, తిరిగి లోపలికి పంపు పంపడానికి మరో 8 గంటల సమయం పడుతున్నదని ఏపీఐఐసీ వాటర్ వర్క్స్ డీజీఎం శ్రీనుబాబు తెలిపారు. శుక్రవారం సాయంత్రానికి నీటి సరఫరా పునరుద్ధరణ జరిగే అవకాశం ఉందన్నారు. గత పద్దెనిమిదేళ్లుగా ఈ మోటార్లు వినియోగిస్తున్నా ఎప్పుడూ ఇలాంటి సమస్య రాలేదన్నారు.

కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్‌గా పీవీజీ కుమార్ బాధ్యతలు స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న పీవీజీ కుమార్. చిత్రంలో ఎమ్మెల్యేలు బండారు, రాజు, లలితకుమారి, కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద, తాతయ్యబాబు, తదితరులు

అనకాపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కొప్పల వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌గా మాడుగుల నియోజకవర్గానికి చెందిన పీవీజీ కుమార్ గురువారం విజయవాడలోని బీసీ భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్‌రాజు, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, కూటమి పార్టీల నేతలు పాల్గొని అభినందలు తెలిపారు.

వైద్యురాలిపై దాడి కేసులో నత్తనడకన దర్యాప్తు!

గోపాలపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 15న వైద్యురాలిపై రోగి కుటుంబీకులు దాడి చేసిన ఘటనపై పోలీసుల దర్యాప్తు నత్తనడకన సాగుతోంది. రోగి బంధువులు తెల్లవారుజాము వరకు విధులకు ఆటంకం కలిగించి, దాడి చేసినట్టు వైద్యురాలు పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు వైద్య సిబ్బందిని, రోగులను విచారించిన పోలీసులు సీసీ టీవీ ఫుటేజీ సేకరించారు. ఈ కేసును రాజీ చేసుకోవాలంటూ అధికార పార్టీకి చెందిన నాయకులు వైద్యురాలిపై ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. దాడి జరిగిన సమయంలోనూ అధికార పార్టీకి నాయకుడి భార్య ఆస్పత్రిలో హల్‌చల్ చేసినట్టు వైద్య సిబ్బంది చెబుతున్నారు.

బాలికను మోసంచేసిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

సీతంపేట, నవంబరు 21: మాయమాటలతో బాలికను మోసం చేసిన నిందితుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గోపాలపట్నంకి చెందిన శ్రీకేశవ (21) అలియాస్ బన్నితో ఓ బాలికకు సోషల్ మీడియాలో పరిచయమయింది. ఈ క్రమంలో ఆమెకు మాయమాటలు చెప్పి ఈ నెల 16న బయటకు తీసుకువెళ్లాడు. పలు ప్రాంతాల్లో తిరిగాడు. కుమార్తె కనిపించడం లేదని తల్లిదండ్రులు ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఇద్దరినీ గుర్తించి స్టేషన్‌కి తీసుకువచ్చారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. బాలికను మోసగించి, శారీరకంగా అనుభవించినట్టు విచారణలో తేలడంతో నిందితుడు శ్రీకేశవపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఖమ్మం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో నగరానికి చెందిన ఓ వ్యక్తి ఖమ్మం జిల్లాలో మృతిచెందాడు. ఎర్రు పాలెం ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల మేరకు.. విశాఖపట్నం జిల్లా పెదముషిడి వాడకి చెందిన పిల్లా కిశోర్ (27) ఎర్రుపాలెం మండలం పెగళ్లపాడు రైల్వేబ్రిడ్జి సమీపంలో గురువారం ఓ చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. స్థానికుల సమచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేశారు. మృతదేహం వద్ద లభించిన ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నామన్నారు.